గురువారం
31-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 310
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

ఓబులాపురం గనులపై సుప్రీంలో మళ్లీ విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం మరోసారి విచారణ జరిగింది. ఏపీ, కర్నాటక మధ్య అంతర్‌రాష్ట్ర సరిహద్దు, మైనింగ్ లీజుల భౌగోళిక పరిధి గుర్తింపుపై వాదనలు జరిగాయి. మైనింగ్ పరిధి గుర్తింపునకు కమిటీ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కమిటీలో ఎవరెవరు ఉండాలన్న దానిపై తమ అభిప్రాయం తెలిపేందుకు సమయం కావాలని అభ్యర్థించగా... తదుపరి విచారణను సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 12కు వాయిదా వేసింది. ఏపీ సీబీసీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్

- మిగతా 2 లో



జస్టిస్ వర్మ కేసులో సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రవర్తన విశ్వసించేదిగా లేదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అంతర్గత (ఇన్-హౌస్) దర్యాప్తు కమిటీ నివేదికను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. ముందే తమను ఎందుకు ఆశ్రయించలేదని జస్టిస్ వర్మను నిలదీసింది. అసలు కమిటీ ఎదుట విచారణకు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించింది. అప్పటికప్పుడే ఆ నివేదికను ఎందుకు సవాల్ చేయలేదో చెప్పాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసిహాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. న్యాయమూర్తి దుష్ప్రవర్తనకు

- మిగతా 2 లో

'నో హెల్మెట్-నో పెట్రోల్'

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వస్తే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించనున్నారు. ఈ మేరకు ఇండోర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన బంకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఉల్లంఘనలకు ఏడాది జైలు లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇండోర్ రోడ్లపై ట్రాఫిక్ నిబంధ నల ఉల్లంఘనలపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల అసహనం వ్యక్తం చేసింది.

భారత్‌పై ట్రంప్ సుంకం పిడుగు

25 శాతం...అదనపు జరిమానా: రేపటి నుంచి అమలు

వాషింగ్టన్/భారత్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై బాంబు పేల్చారు. సుంకాల మోత మోగించారు. ప్రధాని నరేంద్ర మోదీ మెతక వైఖరి కారణంగా ఏకంగా 25 శాతం సుంకాలు పెంచడమే కాకుండా రష్యాతో వాణిజ్యం నడుపు తున్నారంటూ అదనంగా జరిమానా విధించారు. భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు అదనంగా జరిమానా కూడా విధించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 2న ట్రంప్ ప్రకటించిన 26 శాతం సుంకాల్లో ఒక శాతం తగ్గించి... 25 శాతానికి అంగీకరించారు. 'భారత్ మిత్రదేశమే కానీ అమెరికా వస్తువులపై ఎక్కువ సుంకాలు విధిస్తోంది. అందుకే ఆ దేశంతో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం' అని ట్రంప్ వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక

- మిగతా 2 లో

నిసార్ ప్రయోగం విజయవంతం

నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక ముందడుగు వేసింది. 'నాసా, ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రాడార్' భూపరిశీలన ఉపగ్రహం ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్- షార్ నుంచి నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక... 2,393 కిలోల బరువున్న 'నిసార్' ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా కలిసి ప్రయోగించిన తొలి ఉపగ్రహం ఇదే. అత్యంత ఖరీదైన ఉపగ్రహంగా ఇది నిలిచింది. దీని కోసం నాసా 1.16 బిలియన్ డాలర్లు సమకూర్చగా... భారత్ 90 మిలియన్ డాలర్లు వెచ్చించింది. అంతరిక్షంలోకి ఇప్పటివరకు చేర్చిన అత్యంత శక్తిమంతమైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్లలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ ఉపగ్రహాన్ని ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ), నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. అందుకే దీనికి నిసార్ (నాసా-ఇస్రో

- మిగతా 2 లో

ప్రధాని అవమానించారు

ప్రతిపక్షాల ఆగ్రహం- రాజ్యసభ నుంచి వాకౌట్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటుకు రావాల్సిందేనని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో ఆయన పాల్గొనాలని, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం ప్రధాని గైర్హాజరు కావడంపై రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ప్రధానిని పిలవండి అంటూ డిమాండ్ చేశారు. ప్రధానిని సభకు రమ్మనండి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యులను బుజ్జగించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రయత్నించారు. 'మీ ప్రశ్నలకు నేను సమాధానం చెబుతా' అని ఆయన అన్నారు. కానీ ప్రతిపక్ష సభ్యులు ఆయన మాటలు బేఖాతరు చేస్తూ 'పీఎం కో బులావో' (ప్రధానిని పిలవండి)... 'ప్రధాని రావాలి, సమాధానం ఇవ్వాలి' అని నినాదాలు చేశారు. 'ప్రధాని కార్యాలయంలో ఉన్నారని, నేను సమాధానం, స్పష్టత ఇవ్వగలిగినప్పుడు ఆయన రావడం ఎందుకు' అంటూ విపక్ష సభ్యులతో అమిత్‌షా అన్నారు. ఆయన ప్రసంగిస్తుండగా ప్రతిపక్ష సభ్యులంతా తమ స్థానాల్లో నుంచి లేచి... నినాదాలతో సభను హోరెత్తించారు.

గందరగోళం మధ్య ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'ప్రధాని పార్లమెంటు ఆవరణలోనే ఉండి సభకు హాజరు కాకపోవడం అవమానం' అని అన్నారు. దీనికి అమిత్‌షా స్పందిస్తూ 'ప్రధానిని ఎందుకు పిలవాలి... నేను సమాధానం చెబుతున్నా కదా' అన్నారు. దీనికి ఖర్గే స్పందిస్తూ 'సమాధానం ఇచ్చే సామర్థ్యం మీకు లేదని కాదు... కానీ ఈ ప్రశ్నలన్నీ ప్రధాని మోదీకి ఉద్దేశించినవి' అని తెలిపారు. మోదీ ఇక్కడే ఉండి రాకుండా రాజ్యసభను అగౌరపరుస్తున్నారని ఖర్గే చెప్పారు. అనంతరం అమిత్ షా ప్రసంగాన్ని బహిష్కరిస్తూ ప్రతిపక్ష సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు.

ట్రంప్‌ను నిలదీయగలరా?

- యుద్ధాన్ని అర్ధాంతరంగా ఎందుకు ఆపారు
- సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ ప్రశ్నలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌ను అర్ధాంతరంగా ఎందుకు ఆపారో కేంద్రం సమాధానం ఇవ్వాలని రాజ్యసభ సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్థాన్ నుంచి ఫోన్ రాగానే దాడులు ఆపేయడం ఎందుకని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం జరిగిన చర్చలో సంతోశ్ కుమార్ మాట్లాడారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించే పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చినట్లు గొప్పలు పోయే సర్కారు... ఆ దేశం నుంచి ఫోన్ కోసమే వేచివున్నట్లుగా అది జరిగిన మరుక్షణం దాడులు ఆపేసిందని ఆయన విమర్శించారు. కాల్పుల విరమణ ప్రకటించడం కోసం వారిని ఒత్తిడి చేసినదేమిటని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత నైతిక సార్వభౌమాధికారాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీని ఆయన ప్రశ్నించారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అత్యధిక మంది ఫాలోవర్లు కలిగిన నాల్గో వ్యక్తిగా ఉన్న నరేంద్ర మోదీ... ట్రంప్‌ను నిలదీస్తూ కనీసం ఒక్క పోస్టు పెట్టగలరా అని

- మిగతా 2 లో

వెట్టిచాకిరి విముక్తి, కార్మికులకు
ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణను వెట్టిచాకిరీ విముక్తి రాష్ట్రంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించిన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని, ఆర్థిక సహకారం కూడా అందజేస్తామన్నారు. జాతీయ వెట్టి చాకిరి విముక్తి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ, తెలంగాణ అసంఘటిత కార్మికుల సంఘం, స్వచ్ఛంద సంస్థల సంయుక్త అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు బుధవారం నగరంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గానికి ప్రతి ఏడాది కేటాయిస్తున్న 3,500 ఇందిరమ్మ ఇళ్లలో వెట్టి చాకిరి విముక్తి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరతానని చెప్పారు. వెట్టిచాకిరి, అక్రమ రవాణా సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 8069 434343 ఆవిష్కరించారు. వెట్టి చాకిరి నిషేధించి దశాబ్దాలు గడుస్తున్నా... ఇప్పటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరమన్నారు. మానవత్వానికి మాయనిమచ్చ అన్నారు. ఇకనుంచి ఫిబ్రవరి 9న వెట్టిచాకిరి విముక్తి దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి ప్రకటించారు. వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని

- మిగతా 2 లో

కార్పొరేట్‌లకు మోదీ సర్కార్ ఊడిగం

- కమ్యూనిజాన్ని అంతం చేయలేరు
- సీపీఐ వరంగల్ జిల్లా మహా సభలో చాడ వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర-హనుమకొండ : కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. బుధవారం వరంగల్ జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. మోదీ పాలనలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. గడిచిన 11 ఏళ్లుగా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే ప్రజల గొంతు నొక్కుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, వేల కోట్ల రూపాయలను బ్యాంకులకు ఎగ్గొట్టిన వారు బీజేపీతో అంటకాగుతున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతూ రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారని అన్నారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తోందని, కమ్యూనిస్టులను అంతం చేయాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. మావోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేయాలని సీపీఐ మొదటి నుంచి పోరాడుతోందని తెలిపారు. కమ్యూనిస్టులను అంతం చేయలేరని, కమ్యూనిజం ప్రపంచ వ్యాప్త సిద్ధాంతం అని చెప్పారు. కమ్యూనిస్టులు అన్ని దేశాలలో ఉన్నారన్న విషయం రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు గుర్తెరగాలని, అసలు కమ్యూనిస్టులకు బద్ధ శత్రువే బీజేపీ అని అన్నారు. పేదలు, దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, వామపక్షాల దారులు వేరైనా గమ్యం ఒకటేనని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు వామపక్ష ప్రగతిశీల శక్తులు కలిసి ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. రానున్న రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు : తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ రాలేదని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి కాలేదని అన్నారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నీకోసం టైము కేటాయించాలి కరెక్టే!
కానీ ..ఎక్కడా తీరికలేదే, ఓ పక్క మా పార్టీ పనులు,
మరో పక్క నన్ను గెలిపించిన వాళ్ల పనులు!

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై
సుప్రీం తుది తీర్పు నేడు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తుది తీర్పు వెల్లడించనుంది బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేల భవితవ్యం తేలనుంది. దీంతో కోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వనుందనే ఉత్కంఠ అందరిలో నెలకొంది. ఇదిలా ఉండగా... పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ... జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద గౌడ్ ... సుప్రీంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే పలుమార్లు ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం గురువారం ఉదయం తుది తీర్పు ఇస్తుంది.

రష్యాలో భారీ భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ
జపాన్‌పై ప్రభావం

2 లో

ముగిసిన చంద్రబాబు సింగపూర్ పర్యటన

- ఏపీకి తిరుగు ప్రయాణమైన ఏపీ సీఎం
- చివరి రోజు దిగ్గజ సంస్థలు, ప్రముఖ బ్యాంక్‌లతో భేటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా పూర్తయ్యింది. మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్‌లో నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సందర్శించి... వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ-సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్ర ప్రదేశ్, అమరావతి

- మిగతా 2 లో

రష్యాలో భారీ భూకంపం

- తీవ్రత 8.8గా నమోదు - కమచట్కా దీవులే కేంద్రం
- సునామీ హెచ్చరికలు జారీ - జపాన్‌పై ప్రభావం
- పసిఫిక్ దేశాలు అప్రమత్తం: హువాయ్‌ను తాకిన సునామీ తరంగాలు
- అమెరికా తీర ప్రాంతాలు అలర్ట్

మాస్కో: రష్యాలోని కమచట్కా దీవుల్లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత 8.8 తీవ్రతగా నమోదైంది. శక్తిమంతమైన భూ ప్రకంపనలతో జపాన్ సైతం వణికిపోయింది. సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. కమచట్కా దీవుల్లో 3.5 మీటర్ల నుంచి 5 మీటర్ల వరకు సునామీ అలలు నమోదయ్యాయి. జపాన్, హువాయ్, అమెరికా పశ్చిమ తీరం, ఇతర పసిఫిక్ దేశాలకు ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. 1952 తర్వాత ఇంత శక్తిమంతమైన భూకంపం రావడంతో ఇదే మొదటిసారిగా రష్యా సైన్స్ అకాడమీ వెల్లడించింది. అమెరికా తీర ప్రాంతాలు, అలాస్కా, హువాయ్, కోస్టారికా, న్యూజిలాండ్‌కు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. హోనోలులూలో సైరన్లు మోగాయి. సునామీ ముప్పు ఏర్పడిన ప్రాంతాల ప్రజలు ఎత్తైన పర్వతాలకు తరలిపోయి. జపాన్‌లోని హొక్కైడోలో 40 సెంటీమీటర్ల సునామీని గుర్తించారు. రష్యాలోని సెవెరో-కురిలిస్క్‌లో సునామీ అలలు ఎగిసిపడ్డాయి. అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. సునామీ ముప్పును పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం ధ్రువీకరించింది. ముందస్తు జాగ్రత్తలను సూచించింది. అమెరికా కోస్తా ప్రాంతాలు, ఓరెగాన్‌నూ అప్రమత్తం చేసింది. కాలిఫోర్నియా-ఓరేగాన్ తీరంలో 3 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడ్డాయి. ఉత్తర కాలిఫోర్నియా క్రెసెంట్ నగరంలో భారీగా అలలు ఎగిసిపడ్డాయి. జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం ప్రకారం అలల ఎత్తు 3.6 అడుగులుగా నమోదైందని తెలుస్తోంది. కేప్ మెండోసినో నుంచి ఓరెగాన్ సరిహద్దు వరకు ప్రజలను అప్రమత్తం చేశారు. అరెనా కోవ్‌లో 1.6-3 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగిపడ్డాయి. అయితే ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు. ఇదిలావుంటే, పెట్రోపావ్లోవ్స్క్-కమచట్కాలో భారీ భూకంపంతో రష్యాలోని కురిల్ దీవులు, జపాన్‌లోని హక్కైడో దీవులను సునామీ తరంగాలు తాకాయని తెలుస్తోంది. ఈ భూకంప కేంద్రం రష్యాలోని కమచట్కా ద్వీపకల్పంలోని పెట్రోపావ్లోవ్స్క్ నుంచి తూర్పున 136 కిలోమీటర్లు దూరంలో, 19 కిలోమీటర్లు లోతులో ఉందని అమెరికా జియోలాజికల్ ప్రకారం. భూకంపం ధాటికి తీర ప్రాంతాల్లోని నివాస గృహాలు, భవనాలు ఊగిపోయాయి. ప్రజలు భయంతో బయటకు పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో 8-10 సెకన్లు, లేదా అంతకన్నా ఎక్కువసేపు భూమి కంపించినట్లు తెలుస్తోంది. నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకారం అర్ధరాత్రి 12:30కు పశ్చిమ తీరాన్ని సునామీ తరంగాలు తాకే అవకాశం ఉంది. కాలిఫోర్నియా పశ్చిమ తీరంలోని ఇతర ప్రాంతాల్లో సునామీ రావచ్చని తెలిపింది. లా జొల్లా, ఓషన్‌సైడ్ ప్రాంతాలను సునామీ తరంగాలు తాకే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా తీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కాగా, తీవ్రత తగ్గడంతో చాలా ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను ఉపసంహరించుకున్నట్లు సమాచారం.

జపాన్ నుంచి 20 లక్షల మంది తరలింపు

భారీ భూకంపం వల్ల సునామీ ముప్పు ఏర్పడిన క్రమంలో జపాన్ తమ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యుద్ధ ప్రతిపదికన చర్యలు చేపట్టింది. 229 మున్సిపాలిటీల నుంచి రెండు మిలియన్ల (20లక్షలు) మందిని సాయంత్రం 5 గంటలలోపు సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఈ మేరకు అక్కడి ప్రభుత్వ అధికారులు తెలిపారు. సముద్రం వద్దకు వెళ్లవద్దని, ఏ క్షణంలోనూ సునామీ రావచ్చని హెచ్చరించారు. అటు ఫుకుషిమా అణు కేంద్రంలో పనిచేసే కార్మికులందరినీ తరలించేశారు. 2011లో జపాన్‌లో సంభవించిన ప్రకృతి విలయానికి రేడియో ధార్మిక విపత్తు సంభవించిన క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించినట్లు టీఈపీసీఓ వెల్లడించింది. చీఫ్ కేబినెట్ సెక్రటరీ యొషిమాసా హయాషి స్పందిస్తూ ఎవరికి గాయాలు అయినట్లు, లేదా నష్టం వాటిల్లినట్లు తమకు సమాచారం లేదన్నారు. అణు కేంద్రాల వద్ద ఎలాంటి ప్రమాదకర పరిస్థితి నెలకొనలేదని అన్నారు.

మార్క్యూసెస్ దీవుల్లో 4 మీటర్ల అలలు

ఫ్రెంచ్ పసిఫిక్ మార్క్యూసెస్ దీవుల్లో 4 మీటర్ల ఎత్తైన అలలు ఎగిసిపడే ప్రమాదమున్నట్లు ఫ్రెంచ్ పాలినేసియా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఉవాహుకా, నుకు హివా, హివాఓ ప్రాంతాలను ఈ అలలు చేరుకుంటాయని వెల్లడించారు. దీపకల్పంలోని మిగతా దీవుల్లో 0.60 మీటర్ల నుంచి 0.90 మీటర్ల వరకు ఎత్తైన అలలు సంభవిస్తాయని అధికారులు హెచ్చరించారు.

భారత్‌కు ముప్పలేదు

భారత్‌కు ముప్పు లేదని ఇన్‌కాయిస్ పేర్కొంది. హిందూ మహా సముద్ర తీర ప్రాంతాలకు ముప్పు లేదని వెల్లడించింది. శక్తిమంతమైన భూకంపం సంభవించినప్పటికీ ఉత్తర పసిఫిక్, భారత కోస్తా ప్రాంతాలను అప్రమత్తం చేసినప్పటికీ దేశానికి ఎటువంటి నష్టం జరిగే అంచనా లేదని పేర్కొంది. అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలంటూ శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం హెచ్చరికలు జారీచేసింది. అమెరికా పశ్చిమ కోస్తా రాష్ట్రాలపై సునామీ ప్రభావం దృష్ట్యా కాలిఫోర్నియా, హువాయ్‌లోని భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి కోసం అత్యవసర సహాయ నంబర్‌ను ఏర్పాటు చేసింది.

ట్రంప్‌ను నిలదీయగలరా?

(మొదటి పేజీ తరువాయి)

సంతోశ్ కుమార్ సవాల్ విసిరారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆపరేషన్ సైలెన్స్‌ను మోదీ చేపట్టారని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉంటే, జాతీయ ఐక్యతను రాజకీయ గుత్తాధిపత్యంగా మార్చే ప్రయత్నాన్ని బీజేపీ చేసిందని సంతోశ్ కుమార్ విమర్శించారు. విద్వేష ప్రచారాలకు పరిమితమైందని, ఇందులో గోదీ మీడియా ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించేలా 'గోదీ' మీడియా ప్రసారాలు చేసిందన్నారు. జాతీయవాదాన్ని వర్గీకరించే బీజేపీ వైఖరిని ఆయన ఎండగట్టారు. కల్నల్ సోఫియా ఖురేషిని బీజేపీ నాయకులు లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదం పేరిట ఓట్లు అడిగే చరిత్రగల బీజేపీ తమకు జాతీయవాదం నేర్పాలనుకోవడం హాస్యాస్పదమన్నారు. బజరంగ్ దళ్ వంటి స్థానిక ఉగ్రవాద సంస్థలపైనా దృష్టి పెట్టాలంటూ... ఇటీవల చత్తీస్‌గఢ్‌లో సన్యాసినులు (నన్స్)పై దాడిని సంతోశ్ కుమార్ గుర్తుచేశారు. 1965లో పాక్‌ను ఓడించినప్పుడు రామ్‌లీలా మైదానంలో అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ప్రసంగిస్తూ పాకిస్థాన్‌తో పోరు రాజకీయమైనదే తప్ప మతపరమైనది కాదని అన్నారని గుర్తుచేశారు. పాకిస్థాన్‌ను రాజకీయ విరోధిగా ఆయన వర్ణిస్తే... ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ, ప్రతి ఊరు-వాడలో ఇండో-పాక్ పరిస్థితి సృష్టించేందుకు యత్నిస్తోందని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించే మీడియా ప్రసారాలు, నినాదాలను కట్టడి చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించలేదని, సైనికులకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ఇచ్చాయని తెలిపారు. ఉగ్రవాదం వ్యతిరేక చర్యలకు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి గతంలో చెప్పిన మాటలకు, ఇప్పుడు మాట్లాడేదానికి పొంతన లేదన్నారు. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదని నమ్మే పార్టీకి సీపీఐ అని చెప్పారు. 2008లో ముంబై దాడులు జరిగినప్పుడు అప్పట్లో గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నేరుగా ప్రధానిని బలహీనుడిగా విమర్శించడం ఆమోదయోగ్యమా అని ప్రశ్నించారు. ఉగ్రవాదం పేరిట రాజకీయం చేయడం బీజేపీకే చెల్లిందని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అసలు అఖండ భారత సిద్ధాంతాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌ను అనుసరించే వారు నిజంగా నమ్ముతారా అన్న సందేహాన్ని సీపీఐ ఎంపీ వ్యక్తంచేశారు. దేశ ప్రజలను విభజించేందుకు ఇది సమయం కాదని నొక్కిచెప్పారు.

నిజమైన దేశభక్తి, లౌకికవాదం, ఐక్యత కోసం సీపీఐ కట్టుబడి ఉందని సంతోశ్ కుమార్ తెలిపారు. తన ప్రసంగం ప్రారంభంలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా సైనికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌లో 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నారని, వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ మురళీనాయక్ ఒకరని చెప్పారు. మురళీనాయక్ కుటుంబానికి పింఛన్‌గానీ మరే ఇతర ప్రయోజనాలుగానీ అందలేదని తెలిపారు. సైనికులకు, వారి కుటుంబాలకు అక్కరకు రాని ఇలాంటి పథకాన్ని రద్దు చేయడానికి ఇదే సరైన సమయమని సంతోశ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం సైన్యంలో లక్షకుపైగా ఖాళీలు ఉన్నాయని, వీటిని సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని సీపీఐ ఎంపీ కోరారు.

భారత్‌పై ట్రంప్ 'సుంకం' పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటన్నారు. వాణిజ్యపరంగా అడ్డంకులు కూడా ఇక్కడ ఎక్కువేనని 'ట్రూత్'లో పేర్కొన్నారు. రష్యాతో భారత్ వాణిజ్యంపై అక్కసు వెళ్లగక్కారు. భారీగా సైనిక సామగ్రిని భారత్ కొనుగోలు చేస్తోందని, రష్యా నుంచి భారత్‌తో పాటు చైనా కూడా చమురు దిగుమతి చేసుకుంటోందని ట్రంప్ వెల్లడించారు. ప్రపంచమంతా ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ఆపాలని పిలుపునిస్తుంటే... ఈ దేశం రష్యా నుంచి కొనుగోళ్లు సాగిస్తోందని, ఇది మంచిది కాదన్నారు. ఈ చర్యల దృష్ట్యా భారత్‌పై 25 శాతం సుంకాలతో పాటు అదనంగా జరిమానా విధిస్తున్నామని, ఆగస్టు 1 నుంచి ఇవి అమలవుతాయి' అని ట్రంప్ వెల్లడించారు. ప్రతీకార సుంకాల గడువు ఆగస్టు 1వ తేదీతో ముగియనుంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ఉద్దేశాన్ని ప్రధాని మోదీ అమెరికా పర్యటనప్పుడే వ్యక్తం చేసినాగానీ అనుకున్న విధంగా మధ్యంతర ఒప్పందం కుదరలేదు. రెండు దేశాల అధికారుల మధ్య ఐదు దఫాలు చర్చలు జరిగాయి. ఆగస్టు చివరిలో అమెరికా బృందం భారత్‌లో పర్యటించనున్న క్రమంలో ఆరో దఫా చర్చలు జరుగుతాయి. అయితే వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదు కాబట్టి భారత్‌పై 20-25 శాతం సుంకాలు విధించే అవకాశం ఉన్నట్లు ట్రంప్ మంగళవారం సంకేతాలిచ్చారు. ఆగస్టు 1 నుంచి అమెరికా విధించే సుంకాలన్నీ తాత్కాలికమేనని, వాణిజ్య ఒప్పందం ఖరారైన తర్వాత పరిస్థితి మారుతుందని భారతీయ అధికార వర్గాలు వెల్లడించాయి. అమెరికా ఉత్పత్తుల కోసం తమ మార్కెట్ల ద్వారాలు తెరవాలంటూ భారత్‌కు ట్రంప్ పదేపదే పిలుపునిచ్చారు. అయితే వ్యవసాయం-డెయిరీ రంగాలకు సంబంధించి ఏకాభిప్రాయం కుదరక ఒప్పందం ఖరారు కాలేదు.

ముగిసిన చంద్రబాబు సింగపూర్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గత పాలకుల చర్యల కారణంగా ఏపీ-సింగపూర్ మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించటంలో ముఖ్యమంత్రి సఫలీకృతం అయ్యారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు మళ్లీ ఆంధ్ర ప్రదేశ్ వైపు తిరిగి చూసేలా ప్రయత్నించారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్లు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి వారిలో ఏపీ పట్ల సానుకూల వైఖరి కలిగేలా కృషి చేశారు. నవంబరు 14-15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులను సీఎం ఆహ్వానించారు. సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే పర్యటన ఆసాంతం ముఖ్యమంత్రి బృందానికి సహాయ సహకారాలు అందించారు.

నిర్విరామంగా సమావేశాలు... సందర్శనలు

సింగపూర్ వచ్చిన దగ్గర నుంచి చంద్రబాబు బిజీబిజీగా గడిపారు. సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్‌ఐఏ ఇంజనీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పొరేషన్, జీఐసీ, ఎస్‌ఎంబీసీ, కాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, ఎవర్సెండై ఇంజనీరింగ్, టామ్‌సెక్, విల్మర్, టీవీఎస్ మోటార్స్, మండై వైల్డ్‌లైఫ్, అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలను, ఆయా ప్రాంతాల విశేషాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల పాలసీల గురించి వారికి అవగాహన కల్పించారు. భారతదేశంలో పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోకి వచ్చే కంపెనీలకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు సీఎం చెప్పారు. పట్టణాభివృద్ధి, ఐటీ, ఏఐ, ఫినటెక్, మారిటైమ్, పోర్ట్స్ మౌలిక సదుపాయాలపై నిర్వహించిన వేర్వేరు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి ఇక్కడి వనరులను వినియోగించుకుని పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామిక వేత్తలను కోరారు. దీంతో పాటు సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక హౌసింగ్ ప్రాజెక్టు బిడదారి ఎస్టేట్, జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్, టువాస్ పోర్టు, సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ను సీఎం బృందం సందర్శించింది. ఆయా ప్రాజెక్టుల్లో అమలు చేస్తోన్న అత్యుత్తమ, ఆధునిక విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించింది.

ఆకట్టుకున్న తెలుగు డయాస్పోరా

మొత్తం పర్యటనలో సింగపూర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా సమావేశం విశేషంగా నిలిచింది. పర్యటన ఆరంభంలో సింగపూర్‌తో పాటు సమీపంలోని ఐదు దేశాల నుంచి వచ్చిన తెలుగువారు ఆత్మీయ, అభిమానాలతో ముఖ్యమంత్రి బృందానికి ఘన స్వాగతం పలికారు. పర్యటన చివరి రోజు బుధవారం కూడా సీఎం చంద్రబాబు, మంత్రులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్రానికి తిరుగు ప్రయాణం అయ్యారు. పర్యటన ముగించుకుని స్వదేశానికి బయలుదేరిన సీఎం చంద్రబాబుకు సింగపూర్‌లోని తెలుగు ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన బస చేసిన హోటల్‌కు తరలి వచ్చిన స్థానిక తెలుగు ప్రజలు... వీడ్కోలు పలికే సమయంలో జై సీబీఎన్ అంటూ నినాదాలు చేశారు. మరోవైపు సింగపూర్ లోని తెలుగు ప్రజలు చూపిన ఆత్మీయతకు, ప్రేమాభిమానాలకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. సింగపూర్ నుంచి బయలుదేరిన సీఎం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెంటనే బయలుదేరి అర్ధరాత్రికి విజయవాడ చేరుకోనున్నారు.

11 కోట్లు స్వాధీనం

- మద్యం కేసులో వరుణ్‌కుమార్ అరెస్టు
- వేగం పెంచిన సిట్
- అక్రమాలు వెలుగులోకి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాల పేరుతో అనేక దందాలు, అక్రమాలు సాగాయన్న ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేయడంతో అధికారులు విచారణ వేగవంతం చేశారు. తాజాగా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పురుషోత్తం వరుణ్‌కుమార్‌ను హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సిట్ పోలీసులు అరెస్టు చేయడం కీలక పరిణామం చోటు చేసుకుంది. అతడు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో రూ.11 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఏ1గా ఉన్న రాజ్ కేసిరెడ్డి ఆదేశాలతో వరుణ్ తదితరులు కలిసి 12 పెట్టెలలో రూ.11 కోట్లు దాచినట్లు అంగీకరించారు. శంషాబాద్ మండలం కాచారం ఫామ్ హౌస్‌లో సిట్ దాడులకు పాల్పడటంతో అట్టపెట్టెల్లో రూ.11వేల కోట్ల సొమ్ము బట్టబయలైంది. దానిని సీజ్ చేసి... విజయవాడ సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. ఈ భారీ స్థాయిలో డబ్బు పట్టుబడటం వైసీపీ నేతలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టయి... రాజమహేంద్రవరం జైలులో ఉన్నారు. మరిన్ని అరెస్టులు ఉంటాయంటూ సిట్ లీకులిచ్చింది. దీనిపై వైసీపీ అధిష్టానం అప్రమత్తమైంది. వైసీపీ పీఏసీ సమావేశం రాజకీయ ఎత్తుగడలో భాగమనే వాదనలున్నాయి. ఇంతలోనే ఏ-40గా ఉన్న పురుషోత్తం వరుణ్ కుమార్‌ను సిట్ పోలీసులు తమ అదుపులోకి తీసుకోవడంతో కేసు మరింత తీవ్రతరమైంది. మద్యం కుంభకోణం కేసు నమోదైన తర్వాత ఈ కేసులో కీలక వ్యక్తులు... వరుణ్‌ను దేశం దాటించేసినట్లు సమాచారం. అప్పటి నుంచి విదేశాల్లో ఉంటున్న వరుణ్‌కుమార్‌పై లుకౌట్ నోటీసుతోపాటు న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. అతడి నుంచి అనేక కోణాల్లో వివరాలు రాబట్టేందుకు సిట్ పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

వరుణ్ కుమార్ ప్రవేశం ఇలా...

సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ చదివాడు. హైదరాబాద్‌లో ఓ కాఫీ షాపులో నెలకు రూ.32వేల వేతనంతో పని చేశాడు. ప్రవాసాంధ్రుడైన ఓ వైద్యుడి ద్వారా రాజ్ కేసీరెడ్డి బృందం మద్యం కుంభకోణం ఉచ్చులోకి వరుణ్‌ను దించినట్లు సమాచారం. పుదుచ్చేరిలోని లీలా డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి వరుణ్ కుమార్‌ను ఏపీ ఆపరేషన్స్ అధిపతిగా నియమించి, అతడి పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టింది. 2020 జూన్ నుంచి 2024 మార్చి మధ్య 21 నెలల్లో బెవరేజెస్ కార్పొరేషన్ ఈ సంస్థ ఖాతాలో ఏకంగా రూ.459 కోట్లు జమ చేసింది. ఈ వ్యాపార పరిమాణం అసాధారంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ డబ్బంతా వెంటవెంటనే వేర్వేరు ఖాతాల్లోకి మళ్లిపోయిందని, వాటిని విశ్లేషించిన సిట్ అధికారులు -అందులో అత్యధిక శాతం కల్పిత కంపెనీలతో నిర్వహించిన లావాదేవీలుగా గుర్తించినట్లు సమాచారం. వరుణ్‌కుమార్‌ను నిందితుడిగా చేర్చారు. విదేశాల నుంచి వచ్చిన వరుణ్‌కుమార్‌ను సిట్ తమ అదుపులోకి తీసుకుని ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. లీలా డిస్టరీస్ ద్వారా రూ.453.97 కోట్ల వరకు మద్యం కొనుగోళ్లకు జమ కాగా రూ.62 కోట్ల వరకు ముడుపులుగా వెనక్కి వచ్చాయని సిట్ తమ తొలి ఛార్జిషీటులో ప్రస్తావించింది. ఎస్‌ఎస్‌జే షుగర్స్ అనుబంధ సంస్థ ఈ లీలా డిస్టరీస్. లీలాస్ బ్రిలియెంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ, బ్రిటీష్ ఎంపైర్ ప్రీమియం మెచ్యూర్డ్ బ్రాండ్లు ఇక్కడ తయారు చేయించారు. దర్యాప్తులో ఆధారాలు లభించడంతో సిట్ అధికారులు వరుణ్‌ను నిందితుడిగా చేర్చారు. తమిళనాడులోని ఎస్ఎస్‌జే షుగర్స్, ప్రొడక్ట్స్ సంస్థకు సంబంధించిన డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లను రాజ్ కేసీరెడ్డి బెదిరించి వారి అనుబంధ సంస్థ అయిన లీలా డిస్టిలరీస్‌ను ఆధీనంలోకి తీసుకుని, లీలా డిస్టిలరీస్‌తో ఆథరైజేషన్ ఇప్పించి వరుణ్ కుమార్‌ను ఆ కంపెనీకి ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించారు.

జస్టిస్ వర్మ కేసులో సుప్రీం తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ఆధారాలు ఉంటే రాష్ట్రపతి, ప్రధానికి సీజేఐ సమాచారం ఇవ్వగలరని వెల్లడించింది. న్యాయపరమైన తప్పులు జరిగితే దానిపై చర్య తీసుకునే హక్కు సీజేఐకి ఉంటుందన్నారు. జస్టిస్ వర్మ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించేలా దర్యాప్తు కమిటీ నివేదిక ఇవ్వడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఇలాంటి చర్యలు ప్రమాదకర సంప్రదాయానికి దారితీస్తాయని కోర్టుకు తెలిపారు. ఓ టేప్ బయటకు రావడం ద్వారా పరువు పోయిన కారణంగా జస్టిస్ వర్మ ముందే కోర్టును ఆశ్రయించలేకపోయారని కపిల్ సిబల్ వెల్లడించారు. ఇదే సమయంలో జస్టిస్ వర్మ రాజీనామా కోరిన న్యాయవాది మాథ్యూ జె. నెడుంపారాను జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సరైన ఫిర్యాదు ద్వారా పోలీసులను ఆశ్రయించారా అని అడిగారు. వాదనల అనంతరం దర్యాప్తు కమిటీ నివేదికను సవాల్ చేసిన పిటిషన్‌పై తీర్పును న్యాయస్థానం రిజర్వులో పెట్టింది. అలాగే, జస్టిస్ వర్మ రాజీనామా కోరిన నెండుపారా పిటిషన్‌పై తీర్పును కూడా రిజర్వులో పెడుతూ ఉత్తర్వులు జారీచేసింది.

ఓబులాపురం గనులపై సుప్రీంలో మళ్లీ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

రద్దుపై సుప్రీంకోర్టు విచారణ గురువారానికి వాయిదా వేసింది. సంజయ్ తరపు న్యాయవాది కపిల్ సిబల్ గైర్హాజరవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ 49 పేజీల తీర్పు రాసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టుపై గత విచారణ సందర్భంగా జస్టిస్ అమానుల్లా ధర్మాసనం మండిపడింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్‌ను పూర్తి చేసినట్లు ఉందని ధర్మాసనం తెలిపింది. కపిల్ సిబల్ రానందున విచారణను వాయిదా వేయాలని సంజయ్ తరపు జూనియర్ లాయర్ న్యాయస్థానాన్ని కోరారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని సుప్రీంకోర్టు దృష్టికి ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాది ఏఎస్ రాజు తీసుకువచ్చారు. ఈ కేసు విచారణలో తీవ్ర జాప్యం కోసం ప్రయత్నిస్తున్నారంటూ ఏఎస్ రాజు సుప్రీంకోర్టుకు తెలిపారు. కపిల్ సిబల్ గురువారం సుప్రీంకోర్టులో వాదనలకు హాజరు కావాలని, లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సంజయ్‌కి న్యాయస్థానం సూచిస్తూ విచారణ జులై 31వ తేదీకి వాయిదా వేసింది.

నిసార్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

సింథటిక్ ఎపర్చర్ రాడార్) అని పేరు పెట్టారు. ఇది వివిధ పరిశోధనల్లో కొత్త ఒరవడి తీసుకురానుంది. రెండు సింథటిక్ ఎపర్చర్ రాడార్లు(సార్) అమర్చిన తొలి ఉపగ్రహం ఇదే. దీనిలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ రెండు రాడార్లు భారీ డిష్ ఆకారంలో ఉంటాయి. ఇవి భూమి పైకి మైక్రోవేవ్, రేడియో సంకేతాలు పంపి... తిరిగివచ్చిన వాటిని విశ్లేషించి చిత్రాలు తయారుచేస్తాయి. ఈ యాంటీన్నా 12 చదరపు మీటర్ల వైశాల్యం ఉటుంది. దీనిని మడతపెట్టి అంతరిక్షంలోకి పంపిస్తారు. ఇది భూమిపై దాదాపు 20 కిలోమీటర్ల వైశాల్యంలోని ప్రదేశాలను చిత్రీకరించగలదు. ఇస్రోకు చెందిన రిశాట్ సిరీస్‌లో ఒక 'సార్'ను అమర్చిన ఉపగ్రహాలు ఇప్పటికే అంతరిక్షంలో ఉన్నాయి. నిసార్‌కు ఉన్న రెండు రాడార్లలో ఒకటి ఎల్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీ, మరొకటి ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీల్లో పనిచేస్తాయి. ఒకే ప్రదేశానికి సంబంధించి ఏకకాలంలో వేర్వేరుగా చిత్రాలను తీసే అవకాశం లభిస్తుంది. ఈ రాడార్లు పగలు, రాత్రి తేడా లేకుండా మేఘాలు, పొగ, వర్షం, పొగమంచులో స్పష్టంగా ఫొటోలు ఇవ్వగలవు. ఏకకాలంలో వందలాది అగ్నిపర్వతాల్లో మార్పులను గమనించవచ్చు. ఎల్-బ్యాండ్ రాడార్ ఫ్రీక్వెన్సీలో మైక్రోవేవ్ తరంగాలు ఎక్కువ వేవ్‌లెంగ్త్‌తో ప్రసరిస్తాయి. అరణ్యాలు, ఎడారులు, మంచు ఖండాల్లో భూమిని చిత్రీకరించగలవు. ఎస్-బ్యాండ్ రాడార్‌లో తక్కువ వేవ్‌లెంగ్త్‌తో తరంగాలు ప్రసరిస్తాయి. ఇవి పంట పొలాలు, నీటి వనరులు వంటి వాటిని చిత్రీకరించగలవు. ఈ ఉపగ్రహం రోజుకు 80 టీబీ డేటాను సృష్టించగలదు. గతంలో ఇస్రో, నాసా ప్రయోగించిన ఏ ఎర్త్ శాటిలైట్లూ ఇంత డేటా అందించలేదు. ఈ డేటాను క్లౌడ్‌లో భద్రపర్చి పంపిణీ చేస్తారు. నిసార్ రాడార్లు ప్రతి 12 రోజులకు రెండుసార్లు భూమి మొత్తాన్ని కవర్ చేస్తాయి.

వెట్టిచాకిరి విముక్తి, కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 200 మందికిపైగా పెట్టి చాకిరి విముక్తి కార్మికులు ఎదుర్కొన్న బాధల గురించి విన్న తర్వాత ప్రముఖ నటి, బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.వారి మాటలు తన మనసును కదిలించాయని, తన సహకారం ఉంటుందని చెప్పారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ వెట్టిచాకిరికి పాల్పడుతున్న వ్యాపారులు, గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్పొరేట్‌లకు మోదీ సర్కార్ ఊడిగం

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వరంగల్ నగరంలో సీపీఐ భారీ ప్రదర్శన

సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా వరంగల్ నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. శివ నగర్‌లోని సీపీఐ కార్యాలయం తమ్మెర భవన్ నుంచి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ ప్రదర్శన అనంతరం జరిగిన సభలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, పల్లె నర్సింహ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.కె.బాష్ మియా, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, సంగి ఎలేందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, కె.చెన్నకేశవులు, జి.మునీశ్వర్, దామెర కృష్ణ, వి.శంకరయ్య, ఎండీ ఖాసీం, కుమారస్వామి, ఎండీ ఖాసీం, రాజు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : బుధవారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ గిరిజన బాల, బాలికల వసతి గృహాలను ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని నాణ్యమైన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ఉదయం-సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. సిలబస్‌ను నిశ్చిత సమయంలోగా పూర్తి చేయాలని చెప్పారు. వంటగదిని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కూరగాయలు, వంట సామాగ్రిని పరిశుభ్రంగా నిల్వ ఉంచాలన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య చర్యలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా, తక్షణమే మెరుగైన చికిత్స అందించాలన్నారు. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వసతి గృహాల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వసతి గృహాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ భవిత కేంద్రంను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, తహసీల్దార్ సుజాత, ఎంపిడిఓ సునీత, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-మరిపెడ: వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం ఆయన మరిపెడ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వానకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది, నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ మెయింటైన్ చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క చదువుపై ప్రత్యేక దృష్టి సారించి శ్రద్ధతో సబ్జెక్టుల వారిగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధనలో అందించాలన్నారు. వంటశాలను, స్టోర్ గది ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని, వేడి వేడిగా పరిశుభ్రమమైన భోజనాన్ని అందించాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను, సిబ్బంది హాజరు రిజిస్టర్ను తనిఖీ చేశారు. ప్రజలకు సర్టిఫికెట్లు ఇతర సేవలకు సంబంధించి సత్వరంగా వేగంగా సేవలు అందించాలని తహసీల్దార్ కృష్ణవేణికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణవేణి, కమిషనర్ విజయానంద్, డిటి సుచిత్ర, ఆర్ఐ శరత్ చంద్ర, పాఠశాల హెచ్ఎం అంతరావు, వార్డు ఆఫీసర్లు రాములు, యాకూబ్ పాషా, హెల్త్ అసిస్టెంట్ వీరన్న, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో చెరువు మరమ్మతు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -తొర్రూర్ : పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విరెడ్డి, టిపిసిసి వైస్ చైర్మన్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డిలు రైతుల సంక్షేమం కొరకు తన సొంత ఖర్చులతో జిల్లాలోని తొర్రురు మండలంలోని మడిపెల్లి గ్రామంలో చెరువు గండ్లు పడిన కారణంగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యకు పరిష్కారంగా, పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్వినిరెడ్డి చెరువు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని 'ఉప్పరివాని కుంట" చెరువుకు రెండు ప్రదేశాల్లో గండ్లు పడటంతో చెరువులో నిల్వ ఉన్న నీరు వృథా అయిపోతోందని, దీంతో పంటలు నష్టపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు కోరారని అన్నారు. రైతుల బాధలు నాకు బాగా తెలుసు. ప్రభుత్వం సహాయం ఆలస్యం అయితే, నా స్వంత ఖర్చుతో అయినా ఈ చెరువును మరమ్మతు చేయిస్తాను. ఇది ప్రజా నాయకురాలిగా నా బాధ్యత అని పేర్కొన్నారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజల పట్ల ఒక నిజమైన నాయకత్వం ఎలా ఉండాలో చూపిస్తున్న ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ బ్లాక్ మండల నాయకులు, గ్రామస్థులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్‌కు కృత్రిమ కాలు అందజేత

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లా కేంద్రం కొత్తగూడెం కు చెందిన ట్రాన్స్ జెండర్ ప్రమాదవశాత్తు కాలు కోల్పోయి నడవలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ వితరణ అందించారు. బుధవారం ఆయన రూ. 5లక్షల 50 వేల విలువైన జర్మన్ టెక్నాలజీతో నడవడానికి అనుకూలంగా ఉండే కృత్రిమ కాలును అందించారు. స్థానిక విద్యానగర్ లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కసన బోయిన రామ్మూర్తి, కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు వాంకుడోత్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ సయాన్ క్యాన్సర్ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-సిద్దిపేట: ప్రముఖ క్యాన్సర్ కేర్ నెట్వర్క్ సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ సిద్దిపేటలోని మొట్టమొదటి సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సయాన్ క్యాన్సర్ క్లినిక్స్ వ్యవస్థాపకుడు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనాలి శ్రు ంగరం మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఎక్కువ దూరం ప్రయాణించే రోగులకు స్థానికంగా అధునాతన క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉండేలా సిద్దిపేటలో ఈ క్యాన్సర్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య, శస్త్రచికిత్స మరియు రేడియేషన్ ఆంకాలజీ అంతటా 15 కి పైగా ఆంకాలజిస్టుల బృందం మద్దతుతో, సయాన్ యొక్క సిద్దిపేట సెంటర్ కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, సర్జరీ, రేడియేషన్ థెరపీ, ఎముక మజ్జ మార్పిడి, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, ఆంకోఫార్మసీ, జన్యు పరీక్ష వంటి ఆంకాలజీ సేవల యొక్క పూర్తి స్పెక్ట్రంను అందిస్తుందన్నారు. స్క్రీనింగ్, సైకో ఆంకాలజీ మరియు న్యూట్రిషన్ కౌన్సెలింగ్, ట్యూమర్ బోర్డ్ ఆధారిత చికిత్సకు ప్రాప్యతతో పాటు టాప్ టైర్ మెట్రో ఆసుపత్రులలో మాత్రమే కనిపించే ఒక నమూనాను ఇక్కడ ప్లాన్ చేస్తుందన్నారు. సిద్దిపేట పరిసర జిల్లాల నుండి దాదాపు 80 శాతం మంది క్యాన్సర్ రోగులు ప్రస్తుతం చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళతారని, తరచూ ప్రయాణం, వసతి, తప్పిన పనిదినాల్లో భరించలేని ఖర్చులు చేస్తారని ఇలాంటి ఇబ్బందులు తప్పించేలా క్యాన్సర్ సెంటర్‌ను స్థానికంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మెట్రో స్థాయి చికిత్స, లోకల్ యాక్సెస్ ప్రయోగంతో, సయాన్ రోగుల ఇంటి గుమ్మానికి పూర్తిగా ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ కేర్ పర్యావరణ వ్యవస్థను తెస్తుందన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని, మహిళల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు లతో కలిసి బుధవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్ని మొక్కలు నాటారు. అనంతరం నేలకొండపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణ లో మండలానికి చెందిన లబ్దిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదల కష్టాలు చూసిన ప్రభుత్వం వారికి భరోసా కల్పించే విధంగా పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. ప్రతి రోజు పేదల ముఖంలో చిరునవ్వు ఉండేలా తెలంగాణ రాష్ట్రంలో పాలన సాగుతోందని అన్నారు. ప్రతి ఇంటికి మహిళలు మహాలక్ష్మి లుగా ఎన్ని కష్టాలు వచ్చినా ఇండ్లను ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్తారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు, పెట్రోల్ బంక్, రైస్ మిల్ వంటి వ్యాపారాలలో అవకాశం కల్పిస్తున్నా మని, రైతులు పండించే ధాన్యం కొనుగోలు బాధ్యతలు కూడా మహిళా సంఘాలకు అప్పగించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత కూడా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించా మని మంత్రి తెలిపారు. గత పాలకులు పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని, మన ఖమ్మం జిల్లాలో 19 వేల 690, కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తుందన్నారు. అనంతరం మంత్రి నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్డీఓ నరసింహా రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎర్రయ్య, నేలకొండపల్లి మార్కెట్ కమిటి చైర్మన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.పరంజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తెల్లంపై అనుచిత వ్యాఖ్యలు సహించం :పాయం

విశాలాంధ్ర - చర్ల : కొందరు స్వార్థపరులైన నాయకులు, ప్రజాప్రతినిధులు భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుపై ఇష్టారాజ్యంగా ప్రకటనలు చేస్తున్నారని ఇకనుంచి సహించబోమని ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ దొర హెచ్చరించారు. రిజర్వేషన్ల విషయంలో ఆదివాసి ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం జరిగిన ఆదివాసుల సమావేశంలో ఆయన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుకు మద్దతుగా మాట్లాడారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ 1979 లొ ప్రైమరీ విద్యాభ్యాసం ముందు స్కూల్ రికార్డులో ఏ కులం హోదాలో చదువుకున్నాడో స్పష్టం చేయాలని పాయం డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంకట్రావుపై స్వార్థపరులు ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు బాగుండవని ఆగ్రహం వ్యక్తం చేసారు. 1976 తర్వాత కేవలం డీఎస్టీ హోదాలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్య అవకాశం కల్పించింది నిజం కాదా అని సీతారామ్‌ను ప్రశ్నించారు. 1976 ఏడాది నుండి ఎస్టీ, 6 శాతం, ఏజెన్సీ ప్రాంతంలో 2000 నుండి 100 శాతం రిజర్వేషన్లు లంబాడీలు మెజార్టీగా విద్య, ఉద్యోగ, రాజకీయల్లో అవకాశాలు పొందింది నిజం కాదా అని పాయం నిలదీశారు. ఆదివాసీల అవిద్య, అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తమ పలుకు బడి, ఆర్థిక వనరులతొ ఎస్టీ రిజర్వేషన్లు ఉన్న అన్ని రంగాల్లో అధికంగా ఎవరు లబ్ది పొందుతున్నారో సమాజానికి తెలుసనీ, ఈ పరిణామాలపై సర్వేకు సిద్ధమా అని సీతారాంతో పాటు వెంకట్రావుపై విమర్శలు చేసే వారు సర్వేకు సిద్ధమా అని పాయం సవాల్ విసిరారు. ఆదివాసి ముద్దు బిడ్డ వెంకటరావుపై కక్షపూరితంగా ఆరోపణలు చేయడాన్ని ఆదివాసి సమాజం సహించదని స్పష్టం చేసారు. రిజర్వేషన్ల హక్కులపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా భారత రాజ్యాంగం ఐదో షెడ్యూలు 1950 తెలంగాణ రాష్ట్రంలో 9 ఆదివాసి తెగలకు దక్కవలసిన విద్య ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో దక్కక పోవడంతో ఆదివాసి సమాజం వెనుకబడి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ పాలెం, నాగరాజు, ఇర్ప అరుణ్ కుమార్ పర్శిక, రాజు కారం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్య తరాలకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మన చుట్టూ ఆరోగ్య వాతావరణంతోపాటు భవిష్య తరాల కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐ ప్రతాప్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. బుధవారం 12 వార్డు సుభాష్ చంద్రబోస్‌నగర్‌లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలొ వారు పాల్గొన్నారు. జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో నడిచే చిన్నారుల చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ చిల్డ్రన్స్ సంస్థలొ 6 నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలుంటారు. వీరిలో నైతిక విలువల తోపాటు సమాజంలొ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, దైవభీతి ఆధారా సత్ సమాజ నిర్మాణానికి కృషి చేసేలా జేఐహెచ్ సంస్థ తర్ఫీదు నిస్తుంది. దేశ వ్యాప్తంగా చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన మిషన్ ప్లాంటేషన్‌లో భాగంగా ఈ స్కూల్‌లో మొక్కలు నాటారు. పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత కూడా బోధిస్తున్న జమాతే ఇస్లామి హింద్ బాధ్యులని సిఐ ప్రతాప్, సాబీర్ పాషాలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ పిల్లలు మాట్లాడుతూ దివ్య ఖుర్‌ఆన్ లో "మేము ఈ సృష్టిని సమ తుకంగా సృష్టించినట్లు, ఆ సమతుల్యాన్ని భంగపరచకండి " అని అల్లాహ్ సెలవిచ్చాడని చెప్పారు. " మీముందు ప్రళయం ముంచుకొస్తున్న సందర్భంలోనూ మీ చేతిలో ఒక మొక్క ఉంటే దానిని వెంటనే నాటి వేయమని" ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారని చిన్నారులు వెల్లడించారు. భూమి మీద ఒక మొక్క నాటితే అల్లాహ్ స్వర్గం లో మనకోసం ఒక మొక్క నాటుతాడని ప్రవక్త 14 వందల ఏళ్ళ క్రితమే ప్రోత్సహించారని చిన్నారులు వివరించారు. ప్రతి విద్యార్థి తాము చదివే పాఠశాలల్లో తమ వీధుల్లో, మసీదుల్లో ఒక మొక్క అయినా నాటి దానిని పరిరక్షణ చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నారులు చేసిన ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జెఐహెచ్ స్థానిక అధ్యక్షుడు మాజిద్ రబ్బానీ, సభ్యులు అబ్దుల్ బాసిత్, షమీం, అజ్మత్, పర్వీన్ సుల్తానా, ఇర్ఫాన్, జావిద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని సత్తెనపెల్లి గ్రామ రైతు వేదికలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులు పేదలకు వరంగా మారాయన్నారు. ఖానాపూర్ మండలంలో మొత్తం 1,669 కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు 2,532 కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం జరిగింది. వచ్చే నెల నుంచే లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హులైన వారు మిగిలి ఉంటే, వారు దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 4201 కొత్త కార్డులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల మంజూరుల్లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. పెన్షన్లు, రైతు రుణమాఫీ, యువకిరణాలు వంటి పథకాలు కార్డులు లేకపోవడంతో అర్హులకు మంజూరు కాలేదన్నారు. సంబంధిత అధికారులు ఏ శాఖ పరమైన పనులు ఆ శాఖ వెంటనే చేయాలి రేపటి పని కూడా ఈరోజే చేయాలి లేదంటే ఆలస్యం అమృతం కూడా విషమవుతుంది అన్న నినాదాన్ని మర్చిపోకుండా పనులు చేయండి అని తెలియపరిచారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహాలక్ష్మి ఫ్రీ బస్సు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, రూ.500కి గ్యాస్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కడెం ప్రాజెక్టు మారమ్మత్తులకు రూ.9కోట్ల 40 లక్షలు, సదర్మాట్ కెనాల్ మరమ్మతులకు రూ.39 లక్షలు, ఖానాపూర్ పట్టణానికి తాగునీటి సదుపాయం కోసం అమృత్ పథకం కింద రూ.20 లక్షలతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్, శాసనసభ్యులు కలిసి మహిళలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఎస్ఓ రాజేందర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం తో పాటు పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు

కమ్యూనిస్టులు కాదు... మారాల్సింది మతోన్మాదులే

విశాలాంధ్ర-ఖమ్మం: మారాల్సింది కమ్యూనిస్టులు కాదని మతోన్మాదులేనని మతం పేరుతో దేశాన్ని అదోగతి పాలు చేస్తున్న -బిజెపి వైఖరిలో మార్పు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బిజెపి అధ్యక్షులు రాంచంద్రరావు అవగాహన లేకుండా మాట్లాడుతూ కలల ప్రపంచంలో ఊగుతున్నారని తెలంగాణలో బిజెపికి అధికా రం రావడం కల్లా అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సిపిఐ జిల్లా సమితి పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టులు మారాలని రాంచంద్రరావు కోరుతున్నారని ఎందుకు మారాలని సురేష్ ప్రశ్నించారు. పేదల పక్షాన సంక్షేమం, హక్కుల కోసం ప్రజా ఉద్యమాలు -నిర్మిస్తున్నామని దేశ పరిరక్షణ కోసం కమ్యూనిస్టులుగా పోరాడుతు న్నామని ఆయన తెలిపారు. పేదల పక్షాన ఉన్న కమ్యూనిస్టులు మారాలా లేక ఈ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్న బిజెపి మారాలో తేల్చుకోవాలని ఆయన -సూచించారు. ఆర్థిక అంతరాలు పెంచి ఈ దేశాన్ని బిజెపి అస్థిరత వైపు తీసుకుపోతుందని మతం సాకుగా చూపి దేశ ప్రజలను వీడదీస్తుందని ఆయన ఆరోపించారు. బిజెపి మారకపోతే ప్రజలే మారుస్తారని దేశ రాజకీయాలు ఎల్లకాలం ఒక రీతిగా ఉండవని దశాబ్దాలు ఏలిన వారు సైతం ప్రజా తీర్పుకు తల వంచక తప్పలేదన్నారు. కమ్యూనిస్టుల పట్ల కనీస అవగాహన లేని రాంచంద్రరావు ఏదేదో మాట్లాడుతు న్నారని అది పోరాటాల పురిటిగడ్డ ఖమ్మం జిల్లా మాట్లాడే ముందు ఓసారి కమ్యూనిస్టుల పోరాటా లను, త్యాగాలను గుర్తు తెచ్చుకుంటే బాగుండేదని సురేష్ తెలిపారు. భారత దేశ సమాజంలోనే అత్యంత చైతన్యవంతమైన ప్రజలు తెలంగాణ ప్రజలని ఈ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టాలని బిజెపి కలలు కంటుందని అవి నెరవేరబోవని సురేష్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో వర్గాలుగా ఏర్పడి కొట్టుకుంటున్నారని అంతర్గత విబేధాలను బిజెపి రాంచంద్రరావు -సరి చూసుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు. ఖమ్మం జిల్లాలో ఒక -సర్పంచ్, ఒక ఎంపిటిసి స్థానాన్ని కూడా గెలవలేని బిజెపి ఇక్కడ షో చేస్తుందని ఖమ్మం జిల్లా ప్రజలు ఈ రాజకీయాలకు పడిపోరని సురేష్ తెలిపారు. ఇప్పటికైనా బిజెపి కార్పొరేట్లను వదిలి మత రాజకీయాలు మాని ప్రజల పక్షాన ఆలోచన చేస్తే -మంచిదని ఆయన తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వనపర్తి : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ది చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతోపాటు, గృహలక్ష్మి పథకంతో అర్హులైన వారందరికీ 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తుందని చెప్పారు. అదేవిధంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇవ్వడమే కాకుండా గతంలో వారు తీసుకున్న రుణాలు కూడా మాఫీ చేసి వారికే అండగా నిలిచిందన్నారు. ప్రతి పేదవాడు నాణ్యమైన సన్న బియ్యం తినాలని ఆలోచనతో రేషన్ కార్డు కలిగిన పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తుందని చెప్పారు. మిగిలిన పెండింగ్ స్కీంలను కూడా ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి బీసీలకు రిజర్వేషన్ల కోసం కృషి చేస్తున్నారని ఇందుకోసం కేంద్రంపై ఒత్తిడి కూడా తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఇప్పుడు ఖిల్లా ఘనపూర్ లో 3489 మంది లబ్ధిదారుల తో 520 కొత్త రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, ఖిల్లా ఘన్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు విజయ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు రమేష్, సింగిల్ విండో చైర్మన్ మురళీధర్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: పాల్వంచ మండలంలోని జగన్నాథపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్‌పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ గదులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇతర సిబ్బంది హాజరును పరిశీలించారు. విధి నిర్వహణ పట్ల అలసత్వం ప్రదర్శించకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోగులతో ప్రత్యక్షంగా మట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యుల, సిబ్బంది పనితీరు పై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పట్ల అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సమయపాలన అనివార్యమన్నారు. అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గడువు తీరిన ఔషధాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ల చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాల న్నారు. గర్భిణీల వివరాలు నిబంధనల ప్రకారం ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డాక్టర్ రాజు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సదర్ మార్ట్ కెనాల్ నీరు విడుదల

విశాలాంధ్ర బ్యూరో -నిర్మల్ జిల్లా : ఖానాపూర్ మండలంలోని మేడమ్ పల్లి గ్రామ శివారులో సదరమా బ్యారేజ్ సదర్ మాట్ కెనాల్ దిగువన వర్షాకాలపు వరి పంటలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమా బొజ్జు పటేల్ సాగునీటిని విడుదల చేశారు. తదుపరి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి పంటలో పంట చివరి వరకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల జెడ్పిటిసి ఆకుల వెంక గౌడ్ మండల అధ్యక్షులు దొరికిన దయానంద్ రాజురా సత్యం తోట సత్యం తదితరులు పాల్గొన్నారు

ఫామాయిల్ పంటసాగుపై అవగాహన

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: ఫామాయిల్ పంట సాగుతో రైతు పెట్టుబడి తక్కువ పెట్టి ఎక్కువ ఆదాయం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. బుధవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ దగ్గరలోని కె.ఎన్. బయోసైన్స్ ఆయిల్ ఫామ్ నర్సరీని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్. సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నర్సరీ విస్తీర్ణం ఎన్ని ఎకరాలు, నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచారు. ఎన్ని నాటుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సంవత్సరం రైతులకు నాణ్యమైన మొక్కలు ఉన్నాయా, తదితర విషయాలపై జిల్లా ఉద్యాన అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం రైతులకు నర్సరీలో ఒక సంవత్సరం వయస్సు మొక్కలను పెంచి ఇవ్వగా, ఇంకా 1,17,000 మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఒక మొక్క 1.2 మీటర్ ఎత్తులో, 12 ఆకులు కలిగి నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఉద్యాన అధికారి దండు సంజీవరావు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ ఎకరాల్లో నాటించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. నర్సరీ నిబంధనల మేరకు నాణ్యమైన మొక్కలను రైతులకు సకాలంలో అందించాలని, నర్సరీ నిర్వాహకులకు, నర్సరీ కంపెనీ వారికి కలెక్టర్ ఆదేశించారు. అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచాలని నర్సరీ ఇంచార్జికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ ఇంచార్జీ ఉద్యాన అధికారి జే. శ్రీకాంత్, నర్సరీ నిర్వాహకుడు కర్ణాకర్, ములుగు, వెంకటాపూర్ తదితరులు పాల్గొన్నారు.

రంగసముద్రం జలాశయం పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని శ్రీరంగాపూర్ మండలం రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సాగునీరు అందించే భీమా కెనాల్‌కు నీటిని విడుదల చేయడం లేదని రైతులు మంత్రి జూపల్లికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంత్రి జూపల్లి ఇవాళ రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను క్షేత్రస్థాయిలో పరిలిశీలించారు. నీటి విడుదలకు జాప్యం చేసిన సాగునీటి అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నప్పటికి, సాగునీటి అవసరాలకు అనుగుణంగా నీటిని ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని, రోజువారీగా ఎంత నీటిని విడుదల చేస్తున్నారో దాని లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. మంత్రి వెంట ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ కేశవ రావు, డీఇలు కిరణ్ కుమార్, రాజ్ కుమార్, ఏఇఇ వినయ్ కుమార్, ఏఇ అక్షయ్ కుమార్ వున్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కొత్తగూడెం : వర్షాకాల సీజన్‌లో జిల్లాలోని సంక్షేమ హాస్టళ, విద్యాలయాల్లో విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరావుభవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా హాస్టల్స్, విద్యాలయాల్లో నీళ్లు నిలువ ఉండి, చెత్తాచెదారం పెరిగిందన్నారు. సంక్షేమ శాఖ అధికారులు వెంటనే హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్టి హాస్టల్స్ లోనే ఏఎన్ఎంలు ఉన్నారని, ఎస్సీ, బీసీ, ఆశ్రమ గురుకుల వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు దోమతెరలు అందించాలని సంక్షేమ శాఖ ఉన్నత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, సభ్యులు రాజకమల్, లాల్ పాషా, రామకృష్ణ, శ్రీకాంత్, అభిలాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ అమలుపై రాష్ట్ర కమిషనర్ల పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్ తోపాటు బోరెడ్డి అయోధ్య రెడ్డి రెండు రోజులు గురు, శుక్రవారం జిల్లా పర్యటన చేయనున్నట్లు బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా జూలై 31 గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు (పి ఐ ఓ లు), అప్పిలేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 వరకు అప్పీలు దారులతో విచారణ ఉంటుందన్నారు. రెండవ రోజు ఆగస్టు 1 శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించబడతాయన్నారు. ఈ సందర్భంగా, అన్ని శాఖల పి ఐ ఓ లు, అప్పిలేట్ అధికారులు 6 (1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రసీదులు, ప్రశ్నలు, సమాధానాలు, అవసరమైన పాయింట్ వారీ కౌంటర్ సమాచారంతో విచారణలకు తప్పకుండా హాజరవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల పి ఐ ఓ లు ఏ ఏ లు ఇంటరాక్షన్ సెషన్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత, భరోసా పెంపొందించడంలో భాగంగా ప్రతి కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులను మార్గదర్శకాల ప్రకారం నవీకరించి, ప్రదర్శించాలన్నారు.

గురుకులాల సెక్రటరీని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర -ఖమ్మం : గురుకులాల సమస్యలు పరిష్కరించాలని, అద్దె భవనాలలో నలుగుతున్న విద్యార్థుల కు సొంతభవనాలు నిర్మించాలని, ఖమ్మం గురుకులాలు పర్యటనకు వచ్చిన సెక్రెటరీ అలుగు వర్షిని ని కలసి వినతిపత్రం ఇవ్వడానికి వామపక్ష విద్యార్థి సంఘాలు అంబేద్కర్ గురుకులం దగ్గర సంఘాల, ఆధ్వర్యంలో ప్రయత్నించారు. విద్యార్థులను ను చూసి అక్కడి నుండి వెళ్లిపోయిన గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిని, దానవాయిగూడెం దగ్గర ఉన్నారు అని తెలుసుకొని మరల ప్రయత్నం చేసాము అక్కడ కూడా ఆమె విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడకుండా నేను మాట్లాడను అంటూ కారు డోర్ లాక్ చేసుకుని వెళ్లిపోవడానికి ప్రయత్నం చేస్తుంటే వెళ్లకుండా విద్యార్థి సంఘాల ఆపడంతో ఆమె పోలీసు జీబులో వెళ్లిపోయారని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే పిల్లల సమస్యలు వినడానికి కూడా ఇష్ట పడని అధికారిని సస్పెండ్ చేయాలి, అంటూ ఆయా విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘ నాయకుల ఇటుకల రామకృష్ణ, ప్రవీణ్, జిల్లా మస్తాన్, జార్జిరెడ్డి జిల్లా అధ్యక్షులు మందా సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు విద్యార్థి సంఘ నాయకులకు మధ్య తోపులాట జరిగింది.

సీఐ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర, కొమురం భీం : కౌటాల రూలర్ సీఐగా సంతోష్ బుదవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఐ గుంపుల విజయ్ మరియు పోలీస్ సిబ్బంది, సిఐకు అభినందనలు తెలిపారు.

సంపాదకీయం

పట్టాలు తప్పిన ఓటర్ల జాబితా కేసు

బిహార్‌లో ప్రత్యేక లోతైన ఓటర్ల జాబితా తయారీలో జరుగుతున్న అక్రమాలపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసు పట్టాలు తప్పినట్టే. ఈ కేసును ఆగస్టు 12,13 తేదీల్లో విచారిస్తామని న్యాయమూర్తులు సూర్యకాంత్, జోయ్ బాగ్చీతో కూడిన బెంచి మంగళవారం తెలియజేసింది. ఓటర్ల జాబితా తయారీలో జరుగుతున్న అవకతవకలను నిరోధించడానికి సుప్రీంకోర్టు ఆంక్షలేవీ విధించలేదు కనక ఎన్నికల కమిషన్ తాను అనుకున్న రీతిలో ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తుంది. మరో రకంగా చెప్పాలంటే తాము ఫలానావారు భారత పౌరులు కాదు అని భావిస్తే వారిని ఓటర్ల జాబితాలోంచి తొలగిస్తుంది. కొత్తగా తయారు చేస్తున్న జాబితా ఆధారంగా కాకుండా మునుపటి జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించలేదు కనక ఎన్నికల కమిషన్ జాబితా నుంచి తొలగించిన వారికి ఓటు హక్కు లేకుండానే నవంబర్‌లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరిగిపోతాయి. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుని తమకు అనుకూలంగా ఫలితాలను సాధించాలనుకుంటున్న బీజేపీ లక్ష్యం నెరవేరినా ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ గత జులై ఒకటో తేదీ నుంచి ప్రత్యేక లోతైన ఓటర్ల జాబితా సిద్ధం చేసే పనిలో ఉంది. ఎన్నికల కమిషన్ రూపొందించిన కొత్త నియమాల ప్రకారం 2023లో ఓటర్ల జాబితాలో చోటు దక్కని వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవలసి ఉంటుంది. అలాంటి వారిని గుర్తించడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎన్నికల కమిషన్ స్వయంగా జారీ చేసిన గుర్తింపు కార్డులను ప్రామాణికంగా పరిగణించరట. మొదట సుప్రీంకోర్టు వీటిని కూడా ప్రామాణికంగా స్వీకరించాలని సూచించింది. కానీ ఎన్నికల కమిషన్ ఆ సూచనను పట్టించుకోలేదు. తరవాత వీటిని పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణీత ఉత్తర్వు ఏదీ జారీచేయకుండానే ఆదేశం లాంటిది జారీ చేసింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలనుకునే వారు తాము పేర్కొన్న 11 పత్రాలలో ఏదో ఒకటి సమర్పించాలని ఎన్నికల కమిషన్ అంటోంది. ఓటర్లకు రెండేసి ఫారాలు ఇస్తామని చెప్పింది. కానీ కొందరికి ఒకే ఫారం ఇచ్చారని, చాలా ఫారాల మీద ఎన్నికల కమిషన్ తరవున పని చేసే సిబ్బందే సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ వరసలో ఒక కుక్కకు కూడా ఓ పత్రం జారీ అయింది. ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చెప్తున్న లెక్కల ప్రకారం దాదాపు 65 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి మాయమయ్యే అవకాశం ఉంది. తొలగించాలనుకుంటున్న 65 లక్షల మందిలో మరణించిన వారు, అందుబాటులో లేని వారు కూడా ఉన్నారు. కొత్త నిబంధనల ప్రకారం 2003 తరవాత ఓటర్ల జాబితాలో పేర్లు నమోదైన వారు తమ పౌరసత్వాన్ని కూడా నిరూపించుకోవాలట. పౌరసత్వం నిర్ధారించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదు. కనీసం ఈ అంశంపైనైనా సుప్రీంకోర్టు బెంచి ఎన్నికల కమిషన్‌ను కట్టడి చేయడానికి సాహసించలేదు. ఇంతకు ముందు ఫారం 6 నింపి తాము భారత పౌరులమని చెప్తే సరిపోయేది. ఫారాలు నింపడానికి గడువు నాలుగైదు రోజుల కింద ముగిసింది. ఆగస్టు ఒకటవ తేదీన ముసాయిదా జాబితా వెలువరిస్తారు. అభ్యంతరాలను పరిష్కరించిన తరవాత సెప్టెంబర్ 30 న తుది జాబితా వెలువరిస్తారు. ఆ తరవాత ఎన్నికలకు నెలన్నరకన్నా ఎక్కువ సమయం ఉండదు. ఎన్నికల కమిషన్ చేపట్టిన కార్యక్రమానికి ఇప్పటివరకు సుప్రీంకోర్టు నుంచి ఏ నిర్దిష్టమైన ఆదేశమూ లేదు కనక ఎన్నికల కమిషన్ తాను అనుకున్న పద్ధతి ప్రకారం పని కానిచ్చేస్తుంది.

ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానంపై అనేక మంది సుప్రీం కోర్టులో అర్జీలు దాఖలు చేశారు. బిహార్‌లో ఓటు హక్కు హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు మౌలికమైంది. అయినా సుప్రీంకోర్టు ఈ కేసు విచారణకు అవసరమైన ఆసక్తి కనబరుస్తున్నట్టు లేదు. మోదీ ప్రభుత్వ పనుపున ఎన్నికల కమిషన్ చేస్తున్న పని నిరాటంకంగా కొనసాగడాన్ని ఆపే ఉద్దేశం సుప్రీంకోర్టుకు ఉన్నట్టు లేదు. పౌరసత్వ సమస్యను లేవనెత్తి, కోట్లాది మంది ప్రజల దగ్గర లేని పత్రాలు కావాలని ఒత్తిడి చేయడం ద్వారా ముస్లింలకు ఓటు హక్కు లేకుండా చేసే ప్రయత్నం సాగుతోంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు గ్రహించలేదని కాదు. మామూలు సమయాల్లో న్యాయమూర్తులు అనేక తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. ఈసారి కూడా భారీగా ఓటర్ల పేర్లు తొలగిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని మొత్తం ప్రక్రియనే రద్దు చేస్తామని న్యాయమూర్తులు సూర్యకాంత్, బాగ్చీ హెచ్చరించడం నిజమే. కానీ విచారణ తేదీని ఆగస్టు 12–13 తేదీలకు పొడిగించడం వల్ల ఎన్నికల కమిషన్ ప్రయత్నాన్ని సుగమం చేయడానికే మొగ్గు చూపినట్టయింది. ఈ పిటిషన్ విషయంలో ఆయన వైఖరి అనుమానాలకు తావిస్తోంది. వచ్చే నవంబర్‌లో సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవుతారు. ఆయన మీద ఇంతకు ముందే అవినీతి ఆరోపణలతోపాటు అనేక ఆరోపణలున్నాయి. న్యాయమూర్తి సూర్యకాంత్‌ను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించే సమయంలోనే వివాదం తలెత్తింది. ఆ సమయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎ.కె.గోయల్ అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు 2018 జనవరి 12 న ఓ లేఖ రాసి సూర్యకాంత్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే రోజు అప్పటి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి చలమేశ్వర్‌తో పాటు మరో ముగ్గురు న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సుప్రీంకోర్టులో జరుగుతున్న అవకతవకలను బయట పెట్టారు. న్యాయమూర్తి సూర్యకాంత్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం 2018 జనవరి 11 న సిఫార్సు చేసింది. అప్పుడే న్యాయమూర్తి గోయల్ రాసిన లేఖలో సూర్యకాంత్ మీద వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించకుండా నియమించకూడదని ఆ లేఖలో పేర్కొన్నారు. కాని ఆ లేఖను పట్టించుకోకపోగా న్యాయమూర్తి ఎ.కె. మిత్తల్‌ను కాదని సూర్యకాంత్‌ను నియమించేశారు. న్యాయమూర్తి గోయల్ రాసిన లేఖలో సూర్యకాంత్ మీద అవినీతి ఆరోపణలే కాక కులతత్వ ఆరోపణలు కూడా ఉన్నాయని, ఆయన సమకూర్చుకున్న ఆస్తుల మీద కూడా విచారణ జరగాలని కోరారు. సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తి అయితే ఆయన ఏడాదికి పైగా ఆ పదవిలో ఉంటారు. ఆయన మీద గతంలో వచ్చిన ఆరోపణలు చూస్తే బిహార్ ఓటర్ల జాబితా కేసులో ఆయన వైఖరి ఏమిటో సులభంగానే అర్థం అవుతుంది. ఏడురోజులుగా పార్లమెంటు ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షాలకు ఫలితం ఏమైనా దక్కుతుందా!

లాటిన్ అమెరికాకు ట్రంప్ బెదిరింపులు

రోగర్ డి హారిస్, జాన్ పెర్రి

రెండోసారి అమెరికా అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్ గత ఆరునెలల కాలంలో ప్రపంచాన్ని కల్లోలానికి గురిచేస్తున్నారు. ఆయన మాటలే అంతంకాని యుద్ధంగా తయారయ్యాయి. మరోవిధంగా చెప్పాలంటే ఇది నూతన ప్రచ్ఛన్నయుద్ధం. అంతంలేని యుద్ధంలోకి ప్రస్తుతం ప్రపంచం ప్రవేశిస్తున్నది. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలను ట్రంప్ లక్ష్యంగాపెట్టుకున్నారు. ఈదేశాల వద్ద ఆయుధాలు లేవు. ట్రంప్ వద్ద కావలసినన్ని ఆయుధాలు ఉన్నాయి. లాటిన్ అమెరికా దేశాలైన క్యూబా, వెనిజులా, నికరాగ్వా, బొలీవియా తదితర దేశాలను సుంకాలతో బెదిరిస్తున్నాడు. ఈ దేశాలపైన ఆంక్షలు, సుంకాలు విధించడం, ఈ దేశాలనుంచి అమెరికా వచ్చి జీవిస్తున్నవారిని ఆయా దేశాలకు తిరిగి పంపించడం పైన పేర్కొన్నదేశాలకు తీవ్రమైన బాంబుల్లాగా ఉన్నాయి.

క్యూబా, వెనిజులా, నికరాగ్వా, బొలీవియా తదితర లాటిన్ అమెరికా దేశాలపైన ట్రంప్ రకరకాల దాడులు సాగిస్తున్నారు. కొన్ని పశ్చిమదేశాలలో వామపక్షాలు, ఈ దేశాలను రక్షించేందుకు తగిన చర్యలను తీసుకుంటున్నారు. ఈ దేశాలలో ప్రభుత్వాలను మార్చివేసేందుకు వివిధ పథకాలను కూడా రూపొందిస్తున్నారు. ఈ విధంగా ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న అంశం మంచి ఉదాహరణే. బరాక్ ఒబామా అధ్యక్షుడిగా పదవీకాలం ముగిసినతర్వాత అధ్యక్షులైన వారంతా అమెరికాకు అసాధారణమైన ముప్పుగా పరిణమించారు.

చరిత్రకారులు ఇసాక్ సాని ఇలాచెప్పారు. క్యూబా అసాధారణమైన విప్లవశక్తిగా పొరపాటు చర్యను అనుసరించలేదు. అలాగే సమాజంలో కొరతలు ఉన్నాయని ఆయుధాలు కూడాఉన్నాయని ఉన్నవి, లేనివి కలిపి ప్రచారం సాగిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లాటిన్ అమెరికాలో ఆర్థికరంగాన్ని అస్థిరం కావించడానికి చర్యలు తీసుకోవడం మాత్రమేకాదు... ఊపిరాడని పరిస్థితిని తెచ్చిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. అంతేకాకుండా, ఆంతరంగిక అసమ్మతిని, ప్రభుత్వం ప్రతిష్టపైన ప్రజలలో అపనమ్మకం కలిగించేందుకు, అంతిమంగా సమాజం సాధించిన ప్రయోజనాలను ధ్వంసంచేసేందుకు ట్రంప్ పూనుకున్నాడు. అమెరికా బహువిధ (హైబ్రిడ్) యుద్ధంతో క్యూబా తీవ్రంగా ఇబ్బందులపాలైంది. అదేసమయంలో వెనిజులా, నికరాగ్వాలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ మూడు దేశాలకు సంబంధించిన కొందరు అమెరికాకు వలసలు వెళ్లారు. వీరిని తిరిగి స్వంత దేశాలకు పంపివేయాలని ట్రంప్ నిర్ణయించుకున్నందున వారికి రక్షణ కొరవడుతుంది. వెనిజులా, నికరాగ్వా అమెరికాకు ఎగుమతిచేసే వస్తువులపైన అసాధారణమైన సుంకాలను విధించేందుకు సిద్ధపడి బెదిరిస్తున్నాడు.

ఆరు దశాబ్దాలుగా అమెరికా క్యూబాపై దిగ్బంధం విధించడంతో అక్కడ పరిస్థితి మరింత క్లిష్టతరమైంది. అయితే ఈ మూడు దేశాలు చైనాతో వాణిజ్య కూటమిగా ఏర్పడి పోరాటం చేస్తున్నాయి. ఇంకా ఇతర దేశాలతోనూ వాణిజ్య కూటమిగా మారుతున్నాయి. మెక్సికో క్యూబాకు చమురు సరఫరా చేస్తోంది. క్యూబాలో ప్రతిరోజూ విద్యుత్ కోతలను తప్పించడంకోసం చైనా సౌర పానెల్స్‌ను నెలకొల్పుతోంది. అమెరికా ఆంక్షలను ప్రతిఘటించేందుకు వెనిజులా, నికరాగ్వా దేశాలకు ఆహారభద్రతను చైనా కల్పిస్తోంది. వాషింగ్టన్ వలసలువచ్చిన వారిని తిరిగి స్వదేశాలకు పంపడమేకాకుండా ఇప్పటికే 2052 మంది జైళ్లలో ఉన్నారు. వీరిని విడుదల చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వెనిజులాలో అమెరికా మద్దతుగల అతి మితవాద ప్రతిపక్షం అస్తవ్యస్తంగా ఉంది. ట్రంప్ మొదటిసారి అధికారానికి వచ్చినప్పుడు వెనిజులా తాత్కాలిక అధ్యక్షపదవిలో జుయాన్ గుయ్‌డో, అనంతరం ఎడ్మండో గుంజాలెజ్ వెనిజులా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పుడు బైడెన్ పరిపాలన జరుగుతోంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా మదురో ఉన్నారు. అయితే ట్రంప్ ప్రభుత్వం గుంజాలెజ్‌ను అధ్యక్షుడిగా గుర్తించడానికి పూనుకున్నాడు. వలసదారులకు కఠినమైన శిక్ష విధించారు. నికరాగ్వా మితవాద ప్రతిపక్షం కూడా ట్రంప్ తీసుకున్న చర్యకు ఇబ్బంది పడుతోంది. లాటిన్ అమెరికాలో వామపక్షాల ప్రభుత్వాల (పింక్ టైడ్) వైపు మళ్లడం 2018లో మెక్సికోలో ప్రారంభమైంది. అనంతరం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంది. మెక్సికో ప్రస్తుత అధ్యక్షుడు క్లాడియా షైన్‌బామ్ బహుశ: బఫూన్ వైట్‌హౌస్‌తో భాగస్వామ్యం పొందాలని చూస్తున్నాడు. అయినప్పటికీ మెక్సికోకు సుంకాలు విధించడం, వలసకారులను తిరిగిపంపడం, సైనిక జోక్యాల ద్వారా మెక్సికోను ఇబ్బంది పెడుతున్నాడు. చిలీలో గాబ్రియల్ బోరిక్, కొలంబియాలో గుస్తావ్ పెట్రోలు వామపక్షాలవైపు మళ్లారు. అయితే ఈ ఇరువురు తీవ్రమైన తిరోగమన అధికార శక్తులుగా తయారయ్యారు.

చిలీలో కమ్యూనిస్టు అభ్యర్థి జినెట్టి జారాకు ఇప్పటికే జరిగినఅధ్యక్ష ఎన్నికల మొదటిరౌండ్‌లో సానకూల పరిస్థితి ఏర్పడింది. నవంబరులో రెండవ రౌండ్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ సారి మితవాదులతంతా ఒక్కటై జారాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

దళితులపై దాడులు ప్రతిఘటించాలి

కృష్ణ ఝా

దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులపై తక్షణం పోరాటాన్ని ప్రారంభించాలి. ఈ దాడులను ప్రతిఘటించకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. ఇప్పటికే మనం అల్లకల్లోల పరిస్థితుల్లో జీవిస్తున్నాము. ప్రతి 18 నిమిషాలకు దళితులకు వ్యతిరేకంగా ఒక నేరం జరుగుతూనే ఉంది. ప్రతి వారం 13 మంది దళితులు హత్యకు గురవుతున్నారు. ప్రతిరోజూ దళితులపై 27 అత్యాచారాలు జరుగుతున్నాయి. భారత నేర నమోదు బ్యూరో ప్రకారం ప్రతి సంవత్సరం 45 వేల 935 దళితులపై నేర కేసులు నమోదు అవుతున్నాయి. నేర నమోదు బ్యూరో ప్రకటించిన దాని ప్రకారం దళితులపై ఎంత దారుణంగా నేరాలకు పాల్పడుతున్నది మనకు స్పష్టం అవుతున్నది. కేంద్ర ప్రభుత్వం మాత్రం వీటిని పట్టించుకోవడమే లేదు. మహా అయితే దారుణమైన హింసాకాండను ఎవరో ఒక మంత్రి ఖండించడం జరగవచ్చు. దేశంలో ప్రతిరోజూ పదిమంది దళితుల మహిళలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్నాయి. అమాయకులైన బాలికలు, యువతపైన, మహిళలపైన అత్యాచారాలు కొనసాగుతున్నప్పటికీ శాంతి భద్రతలను పరిరక్షించవలసిన పోలీసులు అత్యాచారాలను, దౌర్జన్యాలను కనీసం నేరంగా పరిగణించి కేసులను కూడా నమోదు చేయడం లేదు. పాఠశాలల్లో దళిత బాలబాలికలను ముందు వరుసలో కూర్చొనేందుకు కూడా అనుమతించడం లేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో కుల సమస్య చాలా ఎక్కువగా ఉంది. దళితులు ఇతర దిగువ తరగతి ప్రజలపైన ఉన్నత వర్గాల ధనికులు రకరకాల దారుణాలను చేస్తున్నప్పటికి ప్రభుత్వాలు సైతం మౌనంగా ఉంటున్నాయి. ఈ దుర్మార్గపు సమస్య క్రమం తప్పకుండా నిరంతరాయంగా ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. ఉన్నత కులాల దౌర్జన్యాలను వెనుకబడిన కులాల ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలి.

దళితులపై దౌర్జన్యాల సమస్యను మానవీయ, ప్రజాస్వామ్య పరిరక్షణ భావనతో తిరుగుబాటు చేయవలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. దేశ వ్యాప్తంగా కుల భావనను పూర్తిగా నిర్మూలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యను దళితులు మాత్రమే కాదు దేశంలోని అన్ని ప్రజాస్వామ్య శక్తులు పోరాటంలో పాల్గొనాలి. ఈ పోరాటం దేశ వ్యాప్తంగా విస్తరించాలి. ఇండియాలో ప్రజాస్వామ్యం అప్పుడే వికసిస్తుంది. క్రమంగా ఇది సోషలిజం, సమానత్వం, అందరికీ న్యాయం జరిగే అవకాశాలు ఉంటాయి. అణగారిన వర్గాల సమూహాలు దోపిడీదారులు కాదు. ఆర్థిక, సామాజిక దోపిడీదారుల బారినపడి అల్లాడిపోతున్నారు. ఈ దారుణాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సమాజం మొత్తం పాల్గొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. అయితే కష్టాలను ఎదుర్కొంటున్న కుల భావన పూర్తిగా నిర్మూలించాలనేది ఇక్కడ సమస్య కాదు. ఉన్నత, దిగువ కులాల భావనలు అంత తేలికగా సమసిపోవు. అయితే ఒక కులంపై మరో కులం ప్రత్యేకించి దళితులపై ఉన్నత కులాల ప్రజలు వ్యతిరేకతను కలిగి ఉంటారు.

కులం, వర్గం ఆధారిత దోపిడీలను అందరూ కలిసి ఎదుర్కోవాలి. కులం ప్రజాస్వామ్య శక్తుల మధ్య ఏకీభావన అవసరం. కులతత్వం ప్రతిస్థాయిలోను, వీలైన అన్ని విధాలుగా బయటపెట్టాలి. మానవ గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అంటరానితనాన్ని ఇప్పటికీ ఆచరిస్తున్నారు. అందువల్ల కులతత్వానికి వ్యతిరేకంగా తర్కబద్ధంగా పోరాటం సాగించాలి. సుప్రసిద్ధ మేధావి, కామ్రేడ్ ఎస్.జి.సర్దేశాయ్ ఇలా అన్నారు, " కులం అనేది ఒంటెత్తు పోకడగా ఉండరాదు. గతితార్కిక భౌతికవాదంగా ఉండాలి. ప్రజాస్వామ్య ఐక్యత తప్పనిసరి, సమాజం మొత్తం ఈ భావనకు మద్దతు ఇవ్వాలి. కులంతో సంబంధం లేకుండా సమాజం ఈ భావనను కలిగి ఉండాలి. గుత్త పెట్టుబడిదారీ, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సంపన్నులైన రైతుల డిమాండ్లను సైతం బలపరచాలి. ఇండియా, ఇతర దేశాలలోను ఈ విధానాన్ని అవలంబించాలి. భారీగా భూములు గల భూస్వాములు ఆర్థిక సమస్యలు, వేతనాలు, రుణాలు, వడ్డీరేట్ల అక్రమాలపై సామూహిక పోరాటాలు జరుగుతున్న ఘటనలు కూడా ఉన్నాయి."

> మైనారిటీలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు అనుభవిస్తున్న కష్టాలను మనసులో ఉంచుకుని వీలైన అన్ని విధాలుగా రిజర్వేషన్లను పరిరక్షించుకోవాలి. ఈ కులాలు అనుభవిస్తున్న కష్టాలకు ఆర్థికలేమి కారణం ఒక్కటే కాదు. భూస్వామి వ్యవస్థ ఇప్పటికి వీరిని వెంటాడుతూనే ఉంది.

ప్రజా సమూహాలు ఐక్యంగా నూతన మార్గాలలో తప్పనిసరిగా ఆందోళనలను, పోరాటాలు జరపాలి. హరిజనులంతా ఐక్యం గాకపోతే భూస్వాములు, వడ్డీ వ్యాపారాల అక్రమాలపై పోరాడలేమని కామ్రేడ్ నానాపాటిల్ అన్నారు. శ్రామికులు దోపిడీదారులకు వ్యతిరేకంగా శ్రామికులు అరుణ పతాక ఉద్యమాన్ని నిర్వహించాలి. అరుణ పతాకం ఏనాడో అంటరానితనాన్ని సహించబోదని నానాపాటిల్ తెలిపారు. ఆయన చెప్పిన విషయాలను యాంత్రికంగా తిరిగి అనుసరించరాదు. సమాజంలో చోటు చేసుకున్న అంటరాని తనాన్ని సహించకూడదు. రిజర్వేషన్‌లపై ఈ సూత్రాన్ని రూపొందించినప్పటి నుంచి విస్తృతంగా చర్చలు జరిగాయి. ఊహించలేనంతగా కష్టాలను అనుభవిస్తున్నామన్న వాస్తవాలకు దూరంగా మనం ఉండలేము. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు అనుభవిస్తున్న కష్టాలను మనసులో ఉంచుకుని వీలైన అన్ని విధాలుగా రిజర్వేషన్లను పరిరక్షించుకోవాలి. ఈ కులాలు అనుభవిస్తున్న కష్టాలకు ఆర్థికలేమి కారణం ఒక్కటే కాదు. భూస్వామి వ్యవస్థ ఇప్పటికి వీరిని వెంటాడుతూనే ఉంది. ప్రజాస్వామిక పమాజంలో మనుగడకు స్థానంలేని విలువల నియంత్రణలో వీరి సాంస్కృతిక సామాజిక జీవనం సాగుతున్నది. అందువల్ల తప్పనిసరిగా రిజర్వేషన్ ఉండాలి. అయితే దీన్ని మనం బలిపశువుగా వినియోగించలేము. కొనసాగుతున్న వవివక్షను సమూలంగా సమాజం నుంచి నిర్మూలించాలి, భద్రతలు లేని హరిజనులకు ఇతర కులాల స్థాయిని అందుకోలేము. రిజర్వేషన్‌లు లేకుండా సమాజంలోని ఇతర వర్గాలతో సమంగా పరిగణించడం లేదు. ప్రజాస్వామిక భావనను ధ్వంసం చేసిన ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రిజర్వేషన్‌లు ఇతర వర్గాలతో గుర్తింపు పొందడానికి మొదటి చర్య, ఈ నేపథ్యంలో రిజర్వేషన్ తప్పనిసరి. రిజర్వేషన్‌లు వద్దని వారిస్తున్నా తిరోగామి శక్తులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని మితవాది, మనువాది దాడి జరుగుతున్న కాలంలో దిగువ కులాలపై హింస పెరిగిపోయింది. దీన్ని తక్షణం ప్రతిఘటించాలి.

ప్రపంచ శాంతి తక్షణం అవశ్యం

"కార్మికుల సంక్షేమం ఆ దేశ ఉత్పాదక శక్తి, ప్రజాస్వామ్య ఉచ్ఛస్థితికి తార్కాణమని గ్రీస్ యువత నినదించింది. సామ్రాజ్యవాద దేశాల నెలకొన్న యుద్ధ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి, సామరస్యం, స్వేచ్ఛకోసం గళమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద యుద్ధాలను తక్షణం నిలువరించాలని సంఘటితంగా నినదించారు. గ్రీస్‌లో జరిగిన 34వ గ్రీస్ కమ్యూనిస్టు మహాసభలకు దేశవ్యాప్తంగా యువత పెద్ద సంఖ్యలో హాజరైంది. ఈ సందర్భంగా మహాసభ ప్రాంగణం శక్తిమంతమైన ఎర్రనదిగా మారింది. యువతీ, యువకులు భారీ సంఖ్యలో హాజరైన ఈ సభలో యువత అమెరికా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదాన్ని తీవ్రంగా ఖండించింది. ఆచాయాలోని అలిస్సోస్‌లో జరిగిన ఈ సమావేశంలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డిమిట్రస్ కౌట్సొంబాస్, కేంద్ర కమిటీ కార్యదర్శి థోడోరిస్ కోట్సాండిస్ ప్రధానోపన్యాసం చేశారు. గ్రీస్‌లోని ఆండ్రవిడా, ఆరక్సోస్ సైనిక స్థావరాల వద్ద సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శనలు పెద్దఎత్తున జరిగాయి. పెట్టుబడిదారీ దేశాలు ప్రోత్సహించే నాటో ప్రణాళికలో పాల్గొనే దేశాలకు వ్యతిరేకంగా, వ్యాపార ప్రయోజనాల కోసం బూర్జువా పార్టీల మద్దతును ఈ సమావేశం ఖండించింది. పలస్తీనా ప్రజలపై జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దేశాలు ఈ సందర్భంగా తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. పలస్తీనా పీపుల్స్ పార్టీ ప్రతినిధి రాంజీ సలేం ప్రజల నినాదానికి సంఘీభావం ప్రకటించారు. దేశ ఉత్పత్తిలో భాగస్వాములైన కార్మికరంగం ప్రజాస్వామ్య ఉచ్ఛ స్థితికి తార్కాణమని పేర్కొన్నారు. ప్రధానంగా సోషలిస్ట్ సమాజ రూపకల్పనలో ఉత్పత్తిదారులైన కార్మికవర్గం, ప్రజల నిర్ణయాలే కీలకం. పాత వైరుధ్యాలు, సామాజిక అసమానతలను పరిష్కరించడం, ఉత్పాదక యూనిట్లు, సామాజిక, పరిపాలనా సేవలు, అన్ని అధికార సంస్థల నిర్వహణను నియంత్రించడం ప్రజాస్వామ్యానికి పునాది. సోషలిస్ట్ సమాజం అభివృద్ధి చెందిన కమ్యూనిజంవైపు అడుగులు వేయడానికి, వైరుధ్యాలను అధిగమించడానికి, పాతదాన్ని విడిచిపెట్టడానికి కొత్త ఉత్పత్తి సంబంధాలను అభివృద్ధి చేయడానికి సహాయపడడం తక్షణ కర్తవ్యంగా ఈ మహాసభ పేర్కొంది.

ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ప్రధానంగా సోషలిజం కూలిపోవడానికి గల కారణాలతో సహా వివిధ ప్రశ్నలపై చర్చలు జరిగాయి. "సోషలిజం కూలిపోవడానికి దారితీసిన పరిస్థితుల గురించి తీర్మానాలు చేయడానికి, పార్టీ19వ కాంగ్రెస్‌లో సమకాలీన విప్లవాత్మక వ్యూహాన్ని అభివృద్ధి చేయడానికి, పార్టీ విప్లవాత్మక లక్షణాల పునరుద్ధరణకు సంబంధించిన సుదీర్ఘ మార్గాన్ని అనుసరించడానికి మేము ఆశావాదంగా ఉన్నామని హాజరైన యువత పేర్కొంది. నూతన తరం మాత్రం యుద్ధాల వ్యవస్థతో తాము రాజీపడమని నిష్కర్షగా ప్రతినబూనింది. దోపిడీ, అణచివేత, పేదరికం లేని ప్రపంచం కోసం తాము పోరాడతామని ప్రకటించింది. సోషలిజం కూలదోయడానికి గల కారణాలతో సహా వివిధ ప్రశ్నలకు కేకేఈ ప్రతిస్పందించింది. 1980లలో ఉద్యమించిన గ్లాస్‌నాస్ట్, పెరెస్ట్రోయికాలను విప్లవాత్మక శక్తులుగా వ్యక్తపరిచింది. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలకు యుద్ధం, పేదరికాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా ఉక్రెయిన్‌లో మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధం, అలాగే మధ్యప్రాచ్యం, సూడాన్, లిబియా, కాశ్మీర్, పసిఫిక్, ఆర్కిటిక్, ఇతర ప్రాంతాలలో మరిన్ని ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ యుద్ధాలు పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలను తీర్చడానికి కొద్దిమందిచే నిర్దేశించబడుతున్నాయి! తత్ఫలితంగా మౌలిక సదుపాయాల నాశనం, నిర్మూలన, శరణార్థులు, అధిక ధరలు దీనికి పరిహారమని 34వ మహాసభ నిర్వచించింది.

ఇటీవలి దశాబ్దాలలో ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తుల సహసంబంధంలో గణనీయమైన మార్పును మనం చూశాము. అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద దేశమైన అమెరికా, నాటో, ఈయూ కూటమి దీనికి అధిపత్యం వహిస్తున్నాయి. 25 సంవత్సరాల క్రితం అమెరికా ఆర్థిక వ్యవస్థలో మూడింట ఒక వంతు కంటే తక్కువ విలువ కలిగిన చైనా, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో బిలియనీర్లను ఉత్పత్తి చేసే బలమైన దేశంగా నమోదైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అసమానంగా అభివృద్ధి చెందడమే దీనికి కారణం. పెట్టుబడిదారీ విధానంలోని ఈ అసమాన అభివృద్ధి అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యవస్థలో మార్పులకు దారితీసింది. స్థానిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైరుధ్యాలను తీవ్రతరం చేసింది. ఈ వైరుధ్యాలను రాజకీయ మార్గాల ద్వారా పరిష్కరించకపోతే, అవి

యుద్ధాలకు దారితీస్తాయని 34వ గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ పేర్కొంది. నాటో, ఈయూ సభ్య దేశాలలో మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా సైనిక ప్రయోజనాల కోసం ఖర్చు పెరుగుతోంది. ఇది కొత్త కార్మిక వ్యతిరేక చర్యలను కూడా తీసుకువస్తోంది, గ్రీస్, ఈయూ దేశాలలో 13 గంటల పని దినాల్ని నిర్ణయించే ప్రయత్నం ద్వారా ఇది రుజువు అవుతుంది. వారానికి ఆరు రోజులు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేయడం, ఇది ఏదైనా కార్మిక చట్టాన్ని ఉల్లంఘించే ప్రయత్నమే.

ఈ విపత్కర పరిస్థితుల్లో నేటి ప్రపంచం గందరగోళంలో ఉంది. సంక్షోభాలు, ప్రతిష్టంభనలతో కూరుకుపోయింది. పెట్టుబడిదారుల గరిష్ఠ లాభం కోసం యుద్ధాలు, నేరాలు, దోపిడీ, అన్యాయానికి దారితీస్తుంది. ఈ కుళ్ళిపోయిన వ్యవస్థను కూలదోయడం, సోషలిజం కోసం పోరాడటం తమ కర్తవ్యంగా గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ ప్రతిపాదించింది. గ్రీస్‌లో నిజమైన కార్మికుల, ప్రజల శక్తి ప్రభుత్వం. ఇది మనిషిని మనిషి దోపిడీ చేయకుండా, సోషలిజం–కమ్యూనిజంతో కొత్త సమాజాన్ని నిర్మిస్తుంది. ఈ సమాజం కోసం, మన పోరాటం విలువైనదే! మనం ఈ మార్గంలో మరింత దృఢ సంకల్పంతో కొనసాగుతాము!

(ఐడీ కమ్యూనిజం నుంచి)

ఎస్ఐఆర్ వెనక్కి తీసుకోవాల్సిందే

'ఇండియా' ఎంపీల డిమాండ్... ఏడవ రోజూ నిరసన

న్యూఢిల్లీ : బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీతో సహా ఇండియా ఐక్య సంఘటనకు చెందిన ఎంపీలు బుధవారం వరుసగా ఏడవ రోజు పార్లమెంటు భవన సముదాయంలో నిరసన తెలిపారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రోజు కార్యకలాపాలు ప్రారంభమయ్యే ముందు, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపీలు బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంటు మకర ద్వారం మెట్లపై, సమీపంలో వరుసలో నిలబడి వరుసగా ఏడవ రోజు నిరసన తెలిపిన వారి ముందు 'ఎస్ఐఆర్ లోక్‌తంత్ర పే వార్' అని రాసి ఉన్న భారీ బ్యానర్ ఉంది. 'స్టాప్ ఎస్ఐఆర్ ప్లకార్డులతో, కాంగ్రెస్, డీఎంకే, సమాజ్ వాదీ పార్టీ, ఆర్‌జేడీ, వామపక్ష పార్టీలతో సహా అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో 'ఓటర్ల ఓటు హక్కును తొలగించడం' లక్ష్యంగా ఎస్ఐఆర్ కసరత్తు ఉందని ఆరోపిస్తూ, ఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై ఉభయ సభలలో చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కేరళ నన్స్ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసనలు

చత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు వెలుపల ప్రతిపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు.

ఈ నిరసనల్లో వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. 'నన్స్‌ని విడుదల చేయండి... గూండాలను అరెస్టు చేయండి' అని రాసిన ప్లకార్డులు పట్టుకుని నిరసన చేశారు. కేరళ నన్స్‌పై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని, వారిని దుర్భాలాషలాడుతున్నారని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. పార్లమెంటు వెలుపల ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ 'కేరళకు చెందిన నన్స్‌పై పోలీసులు చాలా దారుణంగా ప్రవర్తించారు.

వారు చేయని పనులను వారిపై నెట్టి అరెస్టు చేశారు. అన్యాయంగా కొట్టిమరీ తీసుకెళ్లారు. మహిళపై ప్రదర్శించిన అనుచిత ప్రవర్తన సరైంది కాదు... వారు చేయని పనులకు వారిని నిందించకూడదు' అని ఆమె అన్నారు. కాగా, మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారని, మత మార్పిడికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ నెల 25న చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు వీరిని అరెస్టు చేశారు.

నన్‌ల విడుదలకు కేంద్రం జోక్యం

లోక్‌సభలో కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : చత్తీస్‌గఢ్‌లో మానవ అక్రమ రవాణా, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై జైలు శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు కాథలిక్ నన్‌ల విడుదల కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కేరళకు చెందిన కాంగ్రెస్ సభ్యులు బుధవారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. కాథలిక్ నన్‌లు ప్రీతి మెర్రీ, వందన ఫ్రాన్సిస్, సుకమాన్ మాండవి ని జులై 25న బీజేపీ పాలిత చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్‌లో నారాయణపూర్‌కు చెందిన ముగ్గురు బాలికలను బలవంతంగా మతమార్పిడి చేసి అక్రమ రవాణా చేశారంటూ స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్త ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. జీరో అవర్‌లో ఈ విషయాన్ని లేవనెత్తిన కాంగ్రెస్ సభ్యులు కేసీ వేణుగోపాల్, కె.సురేష్ మాట్లాడుతూ నన్‌లు క్యాన్సర్ రోగులకు ఉపశమన సంరక్షణ అందించడం ద్వారా సామాజిక సేవ చేస్తున్నందున ఈ సంఘటన 'తీవ్ర కలతపెట్టేది... దిగ్భ్రాంతికరమైనది' అని అన్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ బజరంగ్ దళ్ సభ్యులు నన్‌లను హింసించారని, మత మార్పిడి, మానవ అక్రమ రవాణా అంటూ 'తప్పుడు ఆరోపణలు' చేశారని అన్నారు. ఆగ్రాకు ప్రయాణిస్తున్న ఇద్దరు నన్‌లను దుర్గ్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. 'ఈ ఇద్దరు నన్‌లు ఐదు రోజులుగా ఎటువంటి కారణం లేకుండా జైలులో ఉన్నారు. ఇది ఎంత క్రూరత్వం. దేశం బనానా రిపబ్లిక్ కాదా?. నన్‌లను విడుదల చేయాలని కోరుతూ మేము చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి, కేంద్ర హోం మంత్రికి లేఖ రాశాము. కానీ ముఖ్యమంత్రి బజరంగ్ దళ్ వాదననే పునరావృతం చేస్తున్నారు. ఎంత సిగ్గుచేటు' అని వేణుగోపాల్ అన్నారు. 'ఇది చర్య తీసుకోవాల్సిన సమయం. ప్రభుత్వం చర్య తీసుకోకపోతే, పరిస్థితి అదుపు తప్పుతుంది. కేరళలో కూడా పరిస్థితి అదుపు తప్పుతోంది. ప్రతిచోటా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, మాకు స్పష్టమైన సమాధానం అవసరం. వారిని (నన్‌లు) వెంటనే విడుదల చేయాలి' అని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సభ్యుడు సురేష్ కూడా ఇద్దరు నన్‌ల అరెస్టు అంశాన్ని లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని డిమాండ్ చేశారు. నన్‌లు నిర్దోషులని, సామాజిక సేవ చేస్తున్నారని ఆయన తెలిపారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన వెంటనే నన్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లో ఆందోళనకు దిగారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నన్‌ల అరెస్టును నిరసిస్తూ తమ సీట్లలో నిలబడ్డారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన వారిని లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాదులుగా భావిస్తున్నారు. పూంచ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తుల కదలికలను గుర్తించినట్లు భద్రతా బలగాలు తెలిపాయి. 'పూంచ్ సెక్టార్‌లోని జెన్ ప్రాంతంలో కంచె వెంబడి ఇద్దరు వ్యక్తుల అనుమానిత కదలికలను దళాలు గుర్తించాయి. ఆ వెంటనే కాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది' అని ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో వెల్లడించింది. భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టినట్లు జమ్మూకశ్మీర్ డీజీపీ నలీన్ ప్రభాత్ ధ్రువీకరించారు.

రహస్య సొరంగం మూసి... ఉగ్రవాదులను చంపారు

శ్రీనగర్: పహల్గాం ఉగ్ర దాడి ముష్కరులు దేశం దాటకుండా మన భద్రతా దళాలు వ్యూహం పన్నాయి. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఎం-9, రెండు ఏకే 47 తుపాకులు ఉపయోగించారు. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ ఎవరికంటా పడకుండా దాక్కున్నారు. అయితే... పాకిస్థాన్ జాతీయులైన వీరు తిరిగి తమ దేశానికి వెళ్లలేకపోయారు. భద్రతా దళాల వ్యూహం కారణంగా వారు తప్పించుకోలేకపోయారు. పహల్గాం దాడి అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉన్నతాధికారులు కశ్మీర్‌కు వెళ్లిన సమయంలోనే ఈ వ్యూహం రూపొందించినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ముష్కరులు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూడాలని అమిత్ షా భద్రతా బలగాలకు స్పష్టంచేసినట్లు సమాచారం. ఉగ్రవాదులు వినియోగించిన 8 కి.మీ. మార్గాన్ని భద్రతా బలగాలు గుర్తించి... ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశాయి. ముష్కరులు చొరబాటుకు ఉపయోగించిన ఓ రహస్య సొరంగాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సొరంగాలను వరదలతో ముంచెత్తించారు. దీంతో ఉగ్రవాదులు తప్పించుకునే మార్గం లేకుండా పోయింది. ఆ తర్వాత దళాలు ముష్కరులు ఉన్న ప్రాంతాన్ని ట్రాక్ చేసి... మట్టుబెట్టాయి.

ట్రంప్ అబద్ధం చెబుతున్నారా?

- ప్రధాని మోదీ స్పష్టం చేయాలి
- రాహుల్... ప్రియాంక

న్యూఢిల్లీ : భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పాత్ర గురించి అబద్ధం చెబుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పలేరని... ఆయన అలా చేస్తే, అమెరికా అధ్యక్షుడు నిజాన్ని బయటపెడతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం అన్నారు. అమెరికా అధ్యక్షుడు అబద్ధం చెబుతున్నారని ప్రధాని మోదీ పార్లమెంటులో స్పష్టంగా చెప్పాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు ట్రంప్ వాదనలపై ప్రధాని 'మౌనం' వహించినందుకు కాంగ్రెస్ విమర్శల దాడి చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో పాత్ర పోషించాలని ట్రంప్ తన వాదనను పునరావృతం చేసిన తర్వాత ఈ కాంగ్రెస్ అగ్ర నేతలు ఇద్దరూ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ తాజా వ్యాఖ్యల గురించి, భారతదేశం 20 నుంచి 25 శాతం మధ్య అధిక అమెరికా సుంకాలను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోందని అడిగినప్పుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ 'ట్రంప్ అబద్ధం చెబుతున్నారని ప్రధాని చెప్పలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఏమి జరిగిందో స్పష్టంగా ఉంది. అందరికీ తెలుసు. ఆయన దానిని చెప్పలేకపోతున్నారన్నదే వాస్తవం' అని తెలిపారు. 'ప్రధాన మంత్రి చెబితే... ఆయన (ట్రంప్) బహిరంగంగా నిజం చెబుతారు. అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. వాణిజ్య ఒప్పందం కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని గాంధీ అన్నారు. 'ఇప్పుడు ఎలాంటి వాణిజ్య ఒప్పందం జరుగుతుందో మీరు చూస్తున్నారు' అని ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. ట్రంప్ తన వాదనలను పునరావృతం చేయడం గురించి అడిగినప్పుడు ప్రియాంక గాంధీ మాట్లాడుతూ 'ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి ఉపయోగించిన పదాలు జాగ్రత్తగా వింటే, అవి అస్పష్టంగా ఉన్నాయి. వారు దానిని నేరుగా చెప్పాలి. రాహుల్ జీ నిన్న కూడా అన్నారు. ఆయన (మోదీ) అమెరికా అధ్యక్షుడు అబద్ధం చెబుతున్నారని చెప్పాలి. ఆయన దానిని పార్లమెంటులో చెప్పాలి' అని అన్నారు. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని, 'దాల్ మే కుచ్ కాలా హై (ఏదో అనుమానాస్పదంగా ఉంది)' అని చెప్పే ధైర్యం ప్రధాన మంత్రికి లేదు' అని అన్నారు. 'చర్చలలో మూడవ పక్షం మధ్యవర్తిత్వాన్ని మేము ఎప్పుడూ అంగీకరించలేదనేది మా విధానం. అది నేటికీ మాకు ఆమోదయోగ్యం కాదు. వారు ఎందుకు అంగీకరించారు? కారణాలు ఏమిటి? వారు దేశానికి చెప్పాలి' అని పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. 'ఆయన (మోదీ) తన రెండు గంటల ప్రసంగంలో ఒక్కసారి కూడా ట్రంప్ పేరును ప్రస్తావించలేదు. ట్రంప్ వ్యాఖ్యలను ఖండించి, దేశ ప్రతిష్టను వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పి ఉండాలి' అని ఖర్గే తెలిపారు. మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన భారత్-పాక్ కాల్పుల విరమణ వాదనలను స్పష్టంగా తిప్పికొట్టాలని ప్రధాని మోదీకి సవాలు విసిరారు. 'ఇందిరా గాంధీకి ఉన్నంత ధైర్యం మోదీకి 50 శాతం ఉంటే పార్లమెంటులో స్పష్టంగా చెప్పాలి. డొనాల్డ్ ట్రంప్ అబద్ధం చెబుతున్నాడు' అని రాహుల్ అన్నారు. సభలో గాంధీ తర్వాత మాట్లాడిన ప్రధాని మోదీ... ఏ దేశ నాయకుడూ ఆపరేషన్ సిందూర్‌ను ఆపమని భారతదేశాన్ని అడగలేదని ధ్రువీకరించారు. కానీ దేశానికి మొత్తం ప్రపంచం నుంచి మద్దతు లభించినప్పటికీ, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశ సైనికుల పరాక్రమానికి మద్దతు ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. 26 మంది పౌరులను బలిగొన్న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారతదేశం మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది.

ఎయిరిండియా 100 ఉల్లంఘనలు: డీజీసీఏ

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న అతిపెద్ద విమాన ప్రమాదం తర్వాత ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత విమానయాన సంస్థపై విచారణ జరిపిన జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక విషయాలు వెల్లడించింది. ఎయిరిండియా సంస్థలో 100 ఉల్లంఘనలు చోటుచేసుకున్నట్లు గుర్తించామని పేర్కొంది. అందులో ఏడు ఉల్లంఘనలు లెవెల్-1కి సంబంధించినవని, వీటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండడంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు సూచించింది. సురక్షితమైన విమానయాన కార్యకలాపాలను నిర్ధారించడానికి తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఎయిరిండియాను ఆదేశించింది. ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారనే విషయంపై వివరణాత్మక నివేదిక సమర్పించడానికి ఎయిరిండియాకు జులై 30 వరకు గడువు ఇస్తున్నట్లు డీజీసీఏ పేర్కొంది. ఆగస్టు 23 నాటికి 44 ఇతర ఉల్లంఘనలను పరిష్కరించాలని సూచించింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త మార్పులకు అనువుగా బోయింగ్ 787, 777 పైలట్లకు శిక్షణ ఇవ్వట్లేదని గుర్తించినట్లు తెలిపింది. ఇటీవల ఎయిరిండియాలో నమోదైన అత్యంత తీవ్రమైన ఉల్లంఘనల్లో మిలన్ నుంచి ఢిల్లీకి వెళ్లే ఎయిరిండియా బోయింగ్ 787 విమానం నిబంధనలను ఉల్లంఘించి 2 గంటల 18 నిమిషాలు ఆలస్యం చేసిందని పేర్కొంది. ఇది లెవెల్-1 ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొంది. సీ కేటగిరీ విమానాశ్రయాలకు సరైన రూట్ అసెస్‌మెంట్ నిర్వహించడంలో ఎయిరిండియా విఫలమైందని వెల్లడించింది. డీజీసీఏ గుర్తించిన అదనపు భద్రతా లోపాలలో విమానాల తలుపులు, పరికరాల తనిఖీలలో అసమానతలు, శిక్షణ డాక్యుమెంటేషన్‌లో ఖాళీలు, ఎయిరిండియా ఎయిర్‌బస్ విమానాలకు చీఫ్ పైలట్లు లేకపోవడం వంటివి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రాజస్థాన్‌లో భారీ వర్షాలు

జైపూర్: రాజస్థాన్‌లో రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టు 2 వరకు రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. జైపూర్, కోటా, అల్వార్‌తోపాటు మరికొన్ని జిల్లాల్లో భారీగా వర్షాలు పడుతున్నాయి. దీంతో పలు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీగా కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర రాజధాని జైపూర్‌లో స్కూళ్లకు విద్యాశాఖ అధికారులు సెలవు ప్రకటించారు. సవాయి మాధోపూర్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై భారీగా వరద నీరు చేరింది. దాంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా టోంక్ కోర్టు ప్రాంగణంతోపాటు రహదారులు నీటమునిగాయి. నీట మునిగిన ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

స్టాలిన్ సర్కారుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విషయంలో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేశారని బాలాజీపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సెంథిల్ బాలాజీ కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం కేసు మూసివేయడానికి ప్రయత్నిస్తే న్యాయశాఖ అడ్డుకుందని తాజాగా మందలించింది. 'ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులు ఉన్నారు. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమో. ఆ నిందితులందరికీ ఈ కోర్టు గది సరిపోదు. ఒక క్రికెట్ స్టేడియం కావాలి' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి లంచాలు తీసుకున్నారంటూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన డీఎంకేలో చేరి మంత్రి అయ్యారు. పాతకేసులో సెంథిల్ బాలాజీని ఈడీ 2023లో అరెస్టు చేసింది. ఏడాదికిపైగా జైల్లో ఉన్న ఆయన గతేడాది బెయిల్‌పై బయటికొచ్చారు. ఆయనను స్టాలిన్ సర్కారు వెంటనే మళ్లీ మంత్రిని చేసింది. ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరడంతో సెంథిల్‌బాలాజీ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

జై శ్రీరామ్ అని చెబితే వెళ్లొచ్చన్నారు

ఢిల్లీ పోలీసులపై బెంగాల్ మహిళ పర్వీన్ ఆరోపణలు

కోల్‌కతా : ఢిల్లీ పోలీసులు సాధారణ దుస్తులు ధరించి ఢిల్లీ మురికివాడ నుంచి తనను తీసుకెళ్లి దాడి చేశారని ఆరోపించిన మాల్దాలోని చంచల్ నివాసి సజాను పర్వీన్ బుధవారం తన ఆరోపణలను మరింత బలపరిచింది. బుధవారం కోల్‌కతాలోని తృణమూల్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పర్వీన్ మాట్లాడింది. ఆమె పక్కన రాష్ట్ర మంత్రి, నగర మేయర్ ఫిర్హాద్ హకీమ్, టీఎంసీ ప్రతినిధి కునాల్ ఘోష్ ఉన్నారు. 'నన్ను తీసుకువెళ్లి దాడి చేసిన ప్రదేశాన్ని వారు (ఢిల్లీ పోలీసులు) చూపించడం లేదు' అని ఆరోపించింది. నన్ను, నా కొడుకును ఎక్కడకు తీసుకువెళుతున్నారని వారిని అడిగాను. అది మంగళం అనే ఆసుపత్రి అని నాకు చెప్పారు. 'మొదటి రోజు నలుగురు వ్యక్తులు సాధారణ దుస్తులలో వచ్చి తాము సీఐడీ నుంచి వచ్చామని చెప్పారు. వారు నా ఆధార్ కార్డు అడిగారు. మేము మాల్దా నుంచి వచ్చామని నేను వారికి చెప్పినప్పుడు మీరు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చారని, పశ్చిమ బెంగాల్‌లోని అందరూ బంగ్లాదేశీయులని వారు అన్నారు' అని ఆమె వివరించింది. 'పశ్చిమ బెంగాల్‌లో అందరూ బంగ్లాదేశీయులే అయితే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా బంగ్లాదేశీయురాలేనా?' అని వారిని ప్రశ్నించానని తెలిపింది. ముగ్గురు పిల్లల తల్లి అయిన పర్వీన్... మరుసటి రోజు తనను తీసుకెళ్లారని చెప్పారు. 'వారు నన్ను ఎక్కడికి తీసుకువెళ్లారో... బలవంతంగా చెల్లించాల్సిన రూ. 25 వేలకు సంబంధించి ఎటువంటి సీసీటీవీ ఫుటేజ్ లేదు. వారు మాతో అనేక పత్రాలపై సంతకం చేయించారు. వారు దేని గురించి మాట్లాడుతున్నారో మాకు తెలియదు' అని పర్వీన్ ఆరోపించింది. 'వారిలో ఒకరు నా కొడుకును బలంగా కొట్టారు. అతని చెవి పైన గాయం ఉంది. రక్తస్రావం ప్రారంభమైంది. మేము జై శ్రీ రామ్ అని చెబితే వెళ్లిపోవచ్చని వారు చెప్పారు' అని వివరించింది. తనను, తన పిల్లలను తీసుకెళ్లిన స్థలాన్ని వివరిస్తూ, జామ చెట్టు తప్ప మరేమీ లేదని చెప్పింది. ఢిల్లీలోని వినోద్ నగర్ ప్రాంతంలో శాంతి మార్గ్ సమీపంలో మంగళం ఆసుపత్రి ఉంది. ఆ మహిళను ఒకే చోటికి తీసుకెళ్లారా లేదా అనేది నిర్ధారించబడలేదు. 'వారు నా ఫోన్ అడిగారు. నా దగ్గర ఫోన్ లేదని నేను చెప్పాను. నన్ను రెండుసార్లు కొట్టారు. నన్ను ఎందుకు కొడుతున్నారని నేను వారిని అడిగాను. మేము సీఐడీ నుంచి వచ్చామని వారు సమాధానం ఇచ్చారు. వారు నా భర్తను వేరే ఫోన్ నుంచి పిలిచి రూ. 25 వేలతో రమ్మని చెప్పారు. నా కడుపులో కూడా తన్నారు' అని పర్వీన్ తెలిపింది. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ... పర్వీన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. పర్వీన్ బిడ్డను కూడా వదల్లేదని ఆమె అన్నారు. అక్రమ వలసదారులను పట్టుకోవడం పేరుతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడేవారిని ఎలా హింసిస్తున్నారో దానికి ఉదాహరణగా పేర్కొన్నారు. అయితే ఢిల్లీ పోలీసు డిప్యూటీ కమిషనర్ (తూర్పు) అభిషేక్ ధనియా సోమవారం ఈ ఆరోపణలను ఖండించారు. ఈ రాజకీయ ప్రేరేపితమైనవని తోసిపుచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారిపై... ఎక్కువగా ముస్లింలపై ప్రారంభించిన చర్యలకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న సమయంలో ఈ కుటుంబంపై దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. వీరిలో కొందరు పత్రాలు లేని బంగ్లాదేశ్ వలసదారులని పేర్కొన్నారు. అయితే ఢిల్లీ పోలీసుల పర్వీన్ వాదనలను తిరస్కరించినప్పటికీ, ఆమెపై దాడి జరిగిందని తృణమూల్ ఆరోపిస్తోంది. ఆ పార్టీ పర్వీన్‌ను ఆమె భర్త, వారి పిల్లలతో మీడియా సమావేశం నిర్వహించింది. 'మమతా దీ చెప్పింది నిజమని ఆమె ప్రకటన రుజువు చేస్తుంది. ఢిల్లీ పోలీసులు ఇకపై దానిని తిరస్కరించలేరు' అని తృణమూల్ ప్రతినిధి కునాల్ ఘోష్ అన్నారు. పర్వీన్ కుటుంబం ప్రగతి మైదాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అల్‌ఖైదా ఉగ్రవాది అరెస్టు

బెంగళూరు: అల్‌ఖైదా టెర్రర్ మాడ్యుల్ సూత్రధారిని గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద మాడ్యూల్ వెనక కీలక కుట్రదారు 30 ఏళ్ల షామా పర్వీన్‌ను కర్నాటకలోని బెంగళూరులో అరెస్టు చేసినట్లు తెలిపారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారిని గుర్తించడానికి అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగానే ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కర్నాటక నుంచి ఆమె ఉగ్రవాదులకు సహాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. జులై 23న ఈ మాడ్యుల్‌తో సంబంధమున్న మహమ్మద్ ఫర్దీన్, సెఫుల్లా ఖురేషి, జీషన్ అలీ, మహమ్మద్ ఫైక్ అనే నలుగురు ఉగ్ర అనుమానితులను గుజరాత్, ఢిల్లీ, నోయిడాలో అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీరంతా సోషల్ మీడియాలోని ఓ రహస్య, ఆటో డిలీటెడ్ యాప్ ద్వారా సంప్రదింపులు జరుపుకుంటున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ గ్రూప్ సభ్యులు ఉన్నారని తెలిపారు. వారందరికీ షామా పర్వీన్ నాయకత్వం వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్ర దాడులు అమలుచేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. అల్‌ఖైదా, ఇతర ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్‌సెల్ విభాగంతో, విదేశాలలోని ఉగ్ర సంస్థలతో వీరికి సంబంధాలు ఉన్నాయని, దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని వీరు ఉగ్ర ముఠాలకు చేరవేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ గ్రూప్‌కు చెందిన ఇతర ఉగ్రవాద మద్దతుదారులు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు చేసే వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

విధుల్లో చేరిన తొలిరోజే గుంజీలు తీసిన ఐఏఎస్

లక్నో: విధుల్లో చేరిన తొలిరోజే ఐఏఎస్ అధికారి పరిశుభ్రతపై దృష్టిసారించి బహిరంగంగా మూత్ర విసర్జన చేసిన వారితో గుంజీలు తీయించారు. అయితే ప్రభుత్వ కార్యాలయం అపరిశుభ్రంగా ఉండటాన్ని న్యాయవాదులు నిలదీశారు. ఈ నేపథ్యంలో ఆ ట్రైనీ ఐఏఎస్ అందరి ముందు గుంజీలు తీశారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... పోవాయన్ తహసీల్‌కు కొత్త సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం)గా ట్రైనీ ఐఏఎస్ అధికారి రింకూ సింగ్ నియమితులయ్యారు. విధుల్లో చేరిన తొలిరోజే పట్టణంలో తిరిగి పరిశుభ్రతను పరిశీలించారు. పబ్లిక్ టాయిలెట్స్ పక్కన కొందరు బహిరంగంగా మూత్ర విసర్జన చేయడాన్ని చూశారు. వారితో గుంజీలు తీయించారు. అయితే తాను బ్రాహ్మణుడని, మురికిగా ఉన్న పబ్లిక్ టాయిలెట్‌లోకి వెళ్లలేదని ఒక న్యాయవాది చెప్పాడు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి తిరుగుతుండటాన్ని రింకూ సింగ్ గమనించారు. పిల్లలను స్కూల్‌కు పంపనందుకు వారితో కూడా గుంజీలు తీయించారు. మరోవైపు నిరసన చేపట్టిన న్యాయవాదులను రింకూ సింగ్ కలిశారు. అయితే ఆయనతో మాట్లాడేందుకు న్యాయవాదులు నిరాకరించారు. జనంతో గుంజీలు తీయించడాన్ని నిలదీశారు. తహసీల్ కార్యాలయం, అక్కడి టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని న్యాయవాదులు ప్రశ్నించారు. దీంతో అధికారుల తప్పుగా భావించిన రింకూ సింగ్ అందరి ముందు గుంజీలు తీశారు.

సింధూ జలాలు ఇవ్వం: జైశంకర్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై భారత్ విధించిన ఆంక్షల్లో భాగంగా నిలిపివేసిన సింధూ నదీ జలాల ఒప్పందంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో బుధవారం స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా విడిచిపెట్టేంతవరకూ నదీ జాలల ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్టుగా నీరు, రక్తం కలిసి ప్రవహించవని ఆయన పునరుద్ఘాటించారు. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా నెహ్రూ చేసిన తప్పిదాన్ని మోదీ ప్రభుత్వం సరిచేసిందన్నారు. 'నెహ్రూ నేతృత్వంలో జరిగిన తప్పిదాలు సరిదిద్దలేమని ఆరు దశాబ్దాలుగా చెబుతూ వచ్చారు. కానీ వాటిని మార్చవచ్చని మోదీ ప్రభుత్వం చేసి చూపించింది. ఆర్టికల్ 370ను రద్దు చేశాం. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని సరిదిద్దుతున్నాం' అని జైశంకర్ చెప్పారు. నాడు నెహ్రూ ప్రపంచ శాంతి కోసం కాకుండా బుజ్జగింపు విధానాలతో సింధూ జలాల ఒప్పందంపై సంతకాలు చేశారన్నారు. మోదీ ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఉగ్రవాదం ప్రపంచ అజెండా అయిందని జైశంకర్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ జరుగుతుండగా పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించడం వెనుక మూడో వ్యక్తి ప్రమేయం లేదని జైశంకర్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ నిలిపేయడం వెనుక ఎలాంటి వాణిజ్య కారణాలు లేవన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదన్నారు. పొరుగుదేశం మళ్లీ దాడులకు దిగితే ఆపరేషన్ సిందూర్ కూడా కొనసాగుతుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది: నడ్డా

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు. వారి హయాంలో ఉగ్రవాదాన్ని చూసీచూడనట్లుగా వదిలేశారని మండిపడ్డారు. 'పహల్గాం దాడి, అనంతర చర్యలపై కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న వారు (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ)... గతంలో వారి పాలనను గుర్తుచేసుకోవాలి. వారి హయాంలో ఢిల్లీ, వారణాసి, ముంబై ఇలా ఎన్నో చోట్ల బాంబు పేలుళ్లు సంభవించాయి. వందల మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాకిస్థాన్‌పై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు. మనపై బుల్లెట్లు పేల్చిన వారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది. ఉగ్రదాడులు చేస్తున్న వారితో వాణిజ్య బంధాలు పెంచుకుంది' అని జేపీ నడ్డా ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన విషయాల్లో మోదీ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోందని నడ్డా తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రదాడుల ఘటనలు తగ్గుముఖం పట్టాయని చెప్పుకొచ్చారు.

విశాలాంధ్ర హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి : సీఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశించారు. బుధవారం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళు లర్పించనున్నారని, అనంతరం చారిత్రాత్మక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగ కుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమా నికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్ భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి

ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. అత్యవసర పరిస్థితు లను దృష్టి పెట్టుకొని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు.దినోత్సవ వేడుకలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవా లని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గౌరవం, వైభవాన్ని కాపాడటానికి ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నటరాజన్ పర్యటన విజయవంతం చేయాలి : మంత్రి రాజనర్సింహా

విశాలాంధ్ర - హైదరాబాద్ : అందోల్ నియోజక వర్గంలో ఆగష్టు 1, 2వ తేదీలలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పర్యటనను విజయవంతం చేయటం పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా క్షేత్ర స్థాయిలో ముందస్తు ఏర్పాట్లను కార్యకర్తలతో కలసి పరిశీలించారు. ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పర్యటనలో భాగంగా చేపట్టనున్న పాదయాత్రలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్న కార్యకర్తలకు అవసరమైన ఏర్పాట్లను మంత్రి దామోదర్ రాజనర్సింహా పరిశీలించారు. అందోల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ను పరిశీలించారు. మీనాక్షి నటరాజన్ పర్యటనలో ఆగష్టు 2న అందోల్ పట్టణం లో నిర్వహించే శ్రమదానం కార్యక్రమ ఏర్పాట్లు , కార్యకర్తలతో ముఖాముఖీ సమావేశం ఏర్పాట్ల పై ముఖ్య నాయకులతో చర్చించారు. కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనీ మంత్రి ముఖ్య నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, ముఖ్య నాయకులు సురేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఠాకూర్ మధుసూదన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్లు చిట్టిబాబు, సత్యనారాయణ, శంకర్, యువనాయకులు పృథ్వీ రెడ్డి , వినయ్ గౌడ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు ఉంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : సిటీ సెంట్రల్ లైబ్రరీలో వివిధ విభాగాలలో అన్ని రకాల విలువైన పుస్తకాలు, దినపత్రికలు రీడర్స్‌కు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారుల ఆదేశించారు. బుధవారం చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీని ఆమె సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించి వచ్చిన రీడర్స్‌తో గ్రంథాలయంలో ఉన్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే రీడర్స్ సంఖ్య ఎక్కువగా ఉన్నందున లైబ్రరీ వాలంటరీలను ఏర్పాటు చేసుకొని పలు విభాగాల్లో అందుబాటులో ఉంచాలని అలాగే నియమించిన వారందరికీ ఐడి కార్డు కూడా అందజేయాలని ఆమె సూచించారు. పలు విభాగాల్లో సబ్జెక్టుల వారీగా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని వచ్చే రీడర్స్ కు సులువుగా ఉంటుందని ఆమె సూచించారు. గ్రంథాలయాలు విద్యతోపాటు వ్యక్తిగత వృద్ధి అలాగే సమాజాభి వృద్ధికి ముఖ్యమైనవన్నారు. లైబ్రరీలోని చిల్డ్రన్స్ విభాగం, మహిళా విభాగం, జ్ఞాన జ్యోతి రీడింగ్ హాల్ (అంధులు), పాఠ్యపుస్తకాల విభాగం, పాత దినపత్రికల విభాగం, సమావేశపు హాల్‌లను ఆమె పరిశీలించారు. లైబ్రరీలో నిరంతరం విద్యుత్ తో పాటు త్రాగునీరు అలాగే వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. ఈ గ్రంథాలయంలో వచ్చే లీడర్స్ కోసం ఉన్నత విద్య, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ బుక్స్, యు పి ఎస్ సి, టిజిపిఎస్‌సి, ఈసెట్, నీట్ తదితర కోర్సులకు సంబంధించి విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధులై ఉండాలని ఆమె సూచించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల రిపోజిటరీ మాత్రమే కాదని సమాజంలోని అజ్ఞాన అంధకారాన్ని తొలగించే సన్మార్గం చూపే వైట్ హౌస్‌లని అన్నారు. గ్రంథాలయంలో రోజుకు 1500 పైగా లీడర్స్ వస్తున్నందున అన్ని సదుపాయాలు కల్పించాలని ముఖ్యంగా వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రీడర్స్ కు మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాట్ల గురించి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. తదుపరి కార్యదర్శితో గ్రంథాలయంలోని క్యాడర్ స్ట్రెంత్ , భవనం స్థితిగతులు, నిధుల మంజూరు, పరిపాలన శాంక్షన్ లు తదితర అంశాలపై ఆమె సమీక్షించి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, తహసిల్దార్ రాణా ప్రతాప్ సింగ్, లైబ్రేరియన్ మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ తులిప్'తో సాధికారత : మేయర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఎస్.బి.ఎం-యు 2.0 కింద ప్రారంభించబడిన 'స్వచ్ఛ తులిప్' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా జిహెచ్ఎంసీ యువతను పట్టణ పారిశుధ్యంలో చురుకుగా పాల్గొనేలా చేస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంటరన్ షిప్ పూర్తి చేసిన అప్రెంటిస్ లకు సర్టిఫికేట్ లను మేయర్ విజయలక్ష్మి అందించి అభినందించారు. ఏఐసిటిఈ పోర్టల్ ద్వారా ఎనిమిది మంది ఇంటర్న్‌లను ఎంపిక చేసి జిహెచ్ఎంసీ యొక్క ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య వ్యవస్థలలో నిర్మాణాత్మక శిక్షణ అందించామని చెప్పారు. ఫతుల్లగూడ సి అండ్ డి వేస్ట్ ప్లాంట్, జవహర్‌నగర్ ఎంఎస్.డబ్ల్యు ఫెసిలిటీకి క్షేత్ర సందర్శనల ద్వారా వారు ఆచరణాత్మక అనుభవాన్ని పొందారన్నారు. శిక్షణ కాలంలో అప్రెంటిస్ లు ఘన వ్యర్థాలను వేరు చేయడం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధ అవగాహన , సమాజ పరిశుభ్రతను ప్రోత్సహించే ఐఈసి ప్రచారాలలో చురుకుగా పాల్గొన్నారన్నారు. వ్యర్థాల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడానికి కార్యాచరణ సిఫార్సులతో కూడిన ప్రాజెక్ట్ నివేదికను ఇంటర్న్ లు సమర్పించారని మేయర్ తెలిపారు.

బాక్స్ డ్రైన్ పనులను వేగవంతం చేయాలి : ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డి నగర్‌లో రూ. కోటి 25 లక్షల వ్యయంతో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, డిఈఈ లౌక్య, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్ లతో కలిసి పరిశీలించడం జరిగింది. వర్షాలు కురుస్తున్నందున పనులు వేగవంతం చేయాలనీ, పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. ఉమేష్ సింగ్, కాలనీ అధ్యక్షుడు బల్వంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, హేమా, కుమార్, రాములు గౌడ్, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు, కిషోర్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం.. ఢిల్లీకి తాకట్టు: తక్కెళ్లపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దశాబ్దాలపాటు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ డైరెక్షన్‌లో పాలన నడుస్తుంటే.. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో తనకేదో పరపతి పెరిగిందని ఓవర్ యాక్షన్ చేస్తున్నారని రవీందర్ రావు దుయ్యబట్టారు. ఢిల్లీ కాంగ్రెస్ మీనాక్షి నటరాజన్ ద్వారా తెలంగాణలో పాలిస్తున్నదని, ఇవాళ ఆమె చేతుల్లోనే.. రిమోట్ కంట్రోల్ ఉన్నదని, ఆమె చెప్పినట్లే పాలన జరుగుతున్నదని తక్కెళ్లపల్లి విమర్శించారు.మీనాక్షి నటరాజన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తుండటాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని, సెక్రటేరియట్ లో ప్రభుత్వ అధికార యంత్రాంగంతో ఆమె సమీక్షలు జరపడం ఏమిటని రవీందర్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం ఘటనలో మంత్రులతో రివ్యూ చేయడం ఏమిటని, ముఖ్యమంత్రికి వివరాలు చెప్పాల్సిన మంత్రులు మీనాక్షికి చెప్పడంలో ఆంతర్యం ఏమిటన్నారు. రేవంత్ డమ్మీ సీఎం అని లీడర్ కు, క్యాడర్ కు ఎప్పుడో తెలిసిపోయిందనీ, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్ని మోసం చేశారు, అమలు చేయలేక చేతులెత్తేస్తున్నారని రవీందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్ చార్జ్ ఏనాడైనా పాదయాత్ర చేసిన చరిత్ర ఉన్నదా? మరి ఇప్పుడెందుకు చేస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా బుద్ధి చెబుతారని తక్కెళ్లపల్లి రవీందర్ రావు హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు కబ్జాల నుంచి కాపాడండి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని అంతాయిపల్లి లోని కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజిగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల, ప్రభుత్వభూముల పరిరక్షణ, ప్రజా అవసరాలకు అనుగుణంగా భూముల కేటాయింపులు వంటి పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత కాలనీ, బస్తీ వాసులు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ భూములు కబ్జాలకుగురవుతున్నా యని, కబ్జాల నుంచి కాపాడి ప్రజా ఉపయోగపడే విధంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లుకు కేటాయించాలని మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు, లైబ్రరీలకు 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం నిధులు ఉన్నాయి, ప్రభుత్వ భూములు కేటాయిస్తే జిహెచ్ఎంసి ద్వారా యూపీహెచ్‌సీలు కట్టడానికి సిద్ధంగా ఉన్నారని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లకు భూములు కేటాయించాలని నియోజకవర్గంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల ను గుర్తించడం జరిగిందని, ఆ ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకొని మల్టీపర్పస్‌కు కేటాయిస్తే జిహెచ్ఎంసి ద్వారా నిర్మించుకోవడానికి వీలవుతుందని, ముస్లిం, క్రిస్టియన్లకు స్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు కేటాయిం చాలని తెలిపారు. ఇటీవల జరిగిన దిశ మీటింగ్లో గతంలో జరిగిన దిశ మీటింగ్‌లో పేర్కొన్న అంశాలను పరిగణలకు తీసుకొని వాజ్ పాయ్‌నగర్‌లో ఉన్న ఇంటర్మీడియట్ కాలేజ్, డిగ్రీ కాలేజ్‌లో ఉన్న పరిస్థితులను వివరించినప్పుడు అర్థం చేసుకొని సందర్శించి వెంటనే

రెండున్నర కోట్ల నిధులను కేటాయించడం జరిగింది. అలాగే అదనపు తరగతి గదులు నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు. మల్కాజ్గిరి ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి మెరుగైన వసతులకు కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని, జీవో 58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న పేదలను గుర్తించి అవకతవకలు జరగకుండా పరిశీలించి జీవో 59 ద్వారా డబ్బులు చెల్లించిన వారికి ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, సర్వేనెంబర్ 844 హైదరాబాద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల మధ్య, మల్కాజిగిరి, మారేడుపల్లి మండలాలు భౌగోళిక సరిహద్దులు సూచించకపోవడంతో దాదాపు 55 ఎకరాల స్థలం కబ్జాలకు గురి అవుతున్నాయని అలాంటి స్థలంలో నవోదయ స్కూల్లో ఏర్పాటు చేసే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఎ.డి. సర్వే చేయించాలని, ఇటీవల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మంత్రివర్యులు డి.శ్రీధర్ బాబుని కలిసి సబ్ రిజిస్టర్ ఆఫీస్, డిగ్రీ కాలేజ్ స్థలం కేటాయించాలని కోరగా కలెక్టర్‌ని ఆదేశిస్తూ రాసిన లేఖలను అందజేయడం జరిగింది. సర్వే నెంబర్ 844 హిల్ టాప్ కాలనీలో ప్రభుత్వ భవనమును అంగన్వాడీ సెంటర్ కు లేదా మహిళా భవన్ కేటాయించాలని, సర్వేనెంబర్ 278 టెలికం కాలనీ వినోబా నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని అదే విధంగా యాప్రాల్ సర్వేనెంబర్ 171లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ల నిర్మించాలని, సర్వేనెంబర్ 582, 583 ప్రభుత్వ స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలన్నారు. అల్వాల్ జొన్న బండ ప్రాంతంలో సర్వేనెంబర్ 22 , 23లో ప్రజల కొనుక్కున్న ప్లాట్లను కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తులు రాక్ ల్యాండ్ ఎవెన్యూ అపార్ట్మెంట్లు నిర్మిస్తున్నారని స్థలాన్ని పరిరక్షించి అక్కడ నూతన భవనాలకు అనుమతులు ఇవ్వకూడదని, మౌలాలి ప్రాంతంలో వోక్స్ బోర్డ్ భూములలో రిజిస్ట్రేషన్స్ జరిగేలా కృషి చేయాలని, పేద మహిళలకు ఉపాధి కల్పన కొరకు కుట్టుమిషన్లు అందజేయాలని, పై విషయాలను ఎమ్మెల్యే వినతి పత్రాలను అందజేస్తూ కలెక్టర్ కి సవివరంగా వివరించారు. అందుకుగాను కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి తోడ్పడుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి, డోలి రమేష్, చిన్న యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, హేమంత్ పటేల్, యాదగిరి గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రాజు, విజయ్ శేఖర్, జనార్ధన్, అరవింద్, అరుణ్, విజయ్, ఉష శ్రీ, సూర్యకుమారి, పర్వీన్ వివిధ కాలనీ, బస్తీ వాసులు, కుల సంఘాల నాయకులు, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలను కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి బుధవారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ యూనిఫాం, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ పుస్తకాలను అందిందాయా లేదా అని ఆరా తీశారు. అలాగే హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న విద్య బోధనపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఎంత మంది విద్యార్దలు చదువుకున్నారు. ఇంటర్, 10వ తరగతిలో గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కళాశాల సిబ్బందిని ఆదేశించారు. సమస్యలు ఎమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ప్రశ్నించగా, పరిసర ప్రాంతాల్లో లైట్స్ లేవని, తద్వారా విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని తెలుపగా, లైట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని , పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు మారుతున్న టెక్నాలజీ అవగాహన కల్పిస్తూ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందిం చాలని సంబందిత బోధన

సిబ్బందికి సూచించారు. తదనుగుణంగా కంప్యూటర్లను సమకూర్చుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం తరగతి గదులను అయన పరిశీలిస్తూ, 10వ, తరగతి విద్యార్దులతో ముచ్చటిస్తూ గణిత శాస్త్రాన్ని భోదిస్తూ, విద్యార్దుల యొక్క పరిజ్ఞానాన్ని పరిశీలించడానికి విద్యార్థలతోనే బ్లాక్ బోర్డుపై లెక్కలు, సమాదానాలను చేయించారు. తదుపరి వంటగదిని సందర్శించి నాణ్య తతో కూడిన పరిశుభ్రంగా ఆహార పదార్థలను తయారు చేయాలని వంట చేసే వాళ్ళకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ఆహార పదార్ధలను విద్యార్దులు సక్రమంగా తినేవిధంగా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు

ఫెర్టిలైజర్ షాపును పరిశీలన

అనంతరం కీసరలోని ఫెర్టిలైజర్ షాపును కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ షాపును ఆయన పరిశీలిస్తూ, స్టాక్ రిజిష్టర్‌ను ప్రకారము ఎంత ఓకే కదా ఎరువులు, క్రిమిసహాకార మందులు కంపెనీల వారిగా ఎంత నిల్వ ఉన్నదని కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా ఎరువులు ఎక్కడ నుంచి సరఫరా అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, షాపు సిబ్బందితో మాట్లాడుతూ యూరియానే రైతులు అధిక మొత్తంలో వినియోగిస్తున్నందున, ఇతర ఎరువుల పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేనందున దానికి అనుగుణంగా రైతులందరికి ఎరువులు, పురుగుమందులు వినియోగించడం పై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నకిలీ మందులు, ఎరువులు విక్రయించ కుండా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకటరెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ జి. రజినీకాంత్, ప్రిన్సిపల్ టి. మహాలక్ష్మీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, వ్యవసాయ శాఖ అధికారి మధవి పాల్గొన్నారు.

జనహిత పాదయాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మొయినాబాద్: జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మండల అధ్యక్షులు తమ్మలి మానయ్యలు అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో స్థానిక నాయ కులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ... జనహిత పాదయాత్రలో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని వెల్లడించారు. ప్రజాపా లనలో ప్రజల వద్దకే పాలన ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందుతున్నాయి అనే అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకే వెళ్లి తెలుసుకొని వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. అందులో భాగంగానే గురువారం వికారాబాద్ జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పాదయాత్రకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు

కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గణేష్ గౌడ్ , నాయకుల కుమార్ యాదవ్, రాజు , విఠల్, కరుణాకర్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పటిష్టంగా అమలు చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాదును ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ క్షేత్ర అధికారులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమ అమలును జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ బుధవారం ఉదయం కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోన్లలో జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, అనురాగ్ జయంతి లతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ఆకస్మిక తనిఖీ లో భాగంగా కమిషనర్ కూకట్ పల్లి జోన్ లో ప్రధానంగా మునిసిపల్ వ్యర్థాల సకాలంలో తొలగింపు, దోమల నివారణ (స్ప్రేలు (ఫాగింగ్, యాంటీ లార్వా), పార్కులు, కాలనీలు, నీరు నిలిచే ప్రదేశాల్లో పరిశుభ్రత చర్యలు, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఖైరతాబాద్ సర్కిల్‌లో అమీర్‌పేట్, పంజాగుట్ట, బేగంపేట్ ప్రాంతాలను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి కమిషనర్ వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ ఆరోగ్య పరిరక్షణకు

ఈ నెల 29 నుంచి ప్రారంభమైన వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ఆగస్ట్ 8 వరకూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ 150 వార్డులలో చేపడుతున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ , సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తమ ఇంటి చుట్టూ నీరు నిలవకుండా చూస్తూ, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కమిషనర్ పిలుపు నిచ్చారు.

మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.A. 130/2024 IN O.S. 83/2023

1. పట్టికూటి ప్రదీప్ కుమార్, 2. పట్టికూటి భరత్ కుమార్ పిటీషనర్లు/ప్రతివాదులు

ఎదిరి

అన్వర్ బాషా షేక్ & మరికొందరు రెస్పాండెంట్లు/వాదులు 3వ రెస్పాండెంటు/3వ ప్రతివాది బెల్లంకొండ రాజారావు R/o. H-NO 154/4, ప్లాట్ -77 ప్రాత్ హౌస్, హైదరాబాద్, తెలంగాణ 4 వ రెస్పాండెంటు/4వ ప్రతివాది బెల్లంకొండ పావని w/o. రాజేష్ R/o. H-No. 154/4, ప్లాట్ -77 ప్రాత్ హౌస్, హైదరాబాద్, తెలంగాణ 5 వ రెస్పాండెంటు/5వ ప్రతివాది బెల్లంకొండ అయేష్ షేక్ R/o. H-No. 154/4, ప్లాట్ -77 ప్రాత్ హౌస్, హైదరాబాద్, తెలంగాణ ... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పై నెంబరుగల దావాలో ఇంజక్షన్ ఆర్డర్ కోరుతూ 1, 2 వాదులు 1 నుండి 5 ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా కొట్టివేయమని 1, 2 పిటీషనర్లు పిటీషన్ వేయగా I.A.No 130/2024 గా నెంబరు కాబడినది. సదరు I.A.లో 3 నుండి 5 రెస్పాండెంట్స్/3 నుండి 5 ప్రతివాదులకి శ్రీ కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపినను మీరు 3 నుండి 5 రెస్పాండెంట్స్/3 నుండి 5 ప్రతివాదుల నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నదున సదరు 3 నుండి 5 రెస్పాండెంట్స్‌కి శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియ చేయమని ది. 22.08.2025కి వాయిదా వేశారు. ఆ రోజు ఉదయం 10:30 గం.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ న్యాయవాది ద్వారాగానీ హాజరై మీకుగల అభ్యంతరాలు తెలుపుకో-వలయును, లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షంలో తీర్మానించబడును.
వాయిదా: 22/08/2025

(శ్రీ కోర్టు వారు ఉత్తర్వులతో)

T. నీలిమ (పిటీషనర్ల తరఫు న్యాయవాది)
6-9, రెడ్లా రామాలయం సమీపంలో
పత్తిపాడు, గుంటూరు జిల్లా: 9160586858

In the Court of the Hon'ble VII Addl. Civil Judge (Senior Division) at Vijayawada
I.A.No. 37/2025, I.A.No. 604/2024 in O.S.No. 152/2024

Between: Bandi Anasuya and 2 others - Petitioners
And
Ponnam Kundana and others - Respondents

6th Repondent : Nimmagadda Vamsi Krishna, S/o. N. Visweshwar Rao, R/o. Plat No. A-520, Allwyn Colony Phase-I, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు Petition ను Petitioners 1 to 3 లు తమపైన ది.04-10-2024న పై I.A.No. 604/2024 లో Pass చేసిన Exparte order ను రద్దు పరిపించమని కోరుచూ దాఖలు చేసిన Petition లో 6వ Respondent కు Notice ల నిమిత్తం ది. 07-08-2025నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఈ రోజు ఉదయం 10.30 ని॥ 6వ Respondent స్వయంగా కానీ, అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను, లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

"By Court Order"

ఇట్లు
P. DINESH KUMAR
Petitioners తరుపు అడ్వకేట్, గన్నవరం
వాయిదా: 07-08-2025

In the Court of the Hon'ble VII Addl. Civil Judge (Senior Division) at Vijayawada
I.A.No. 38/2025, I.A.No. 605/2024 in O.S.No. 152/2024

Between: Bandi Anasuya and 2 others - Petitioners
And
Ponnam Kundana and others - Respondents

6th Repondent : Nimmagadda Vamsi Krishna, S/o. N. Visweshwar Rao, R/o. Plat No. A-520, Allwyn Colony Phase-I, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు Petition ను Petitioners 1 to 3 లు తమపైన ది.04-10-2024న పై I.A.No. 605/2024 లో Pass చేసిన Exparte order ను రద్దు పరిపించమని కోరుచూ దాఖలు చేసిన Petition లో 6వ Respondent కు Notice ల నిమిత్తం ది. 07-08-2025నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఈ రోజు ఉదయం 10.30 ని॥ 6వ Respondent స్వయంగా కానీ, అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను, లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

"By Court Order"

ఇట్లు
P. DINESH KUMAR
Petitioners తరుపు అడ్వకేట్, గన్నవరం
వాయిదా: 07-08-2025

In the Court of the Hon'ble VII Addl. Civil Judge (Senior Division) at Vijayawada
I.A.No. 36/2025 in O.S.No. 152/2024

Between: Bandi Anasuya and 2 others - Petitioners
And
Ponnam Kundana and others - Respondents

6th Repondent : Nimmagadda Vamsi Krishna, S/o. N. Visweshwar Rao, R/o. Plat No. A-520, Allwyn Colony Phase-I, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు Petition ను Petitioners 1 to 3 లు తమపైన ది.04-10-2024న పై నెంబరు దావాలో Pass చేసిన Exparte order ను రద్దు పరిపించమని కోరుచూ దాఖలు చేసిన Petition లో 6వ Respondent కు Notice ల నిమిత్తం ది. 07-08-2025నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఈ రోజు ఉదయం 10.30 ని॥ 6వ Respondent స్వయంగా కానీ, అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను, లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

"By Court Order"

ఇట్లు
P. DINESH KUMAR
Petitioners తరుపు అడ్వకేట్, గన్నవరం
వాయిదా: 07-08-2025

ప్రతి ఇంటిలో రెండు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - తూర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో రెండు మొక్కలు నాటలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ అన్నారు. ఇంజాపూర్ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మీదాని కాలనీలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీదాని కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగాణంలో వారు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మీదాని కాలనీ గౌరవ అధ్యక్షులు బత్తుల శంకర్ గౌడ్, మాజీ అధ్యక్షులు మల్లెల దేవేందర్, గౌడ సంగం అధ్యక్షులు లోడే పాపయ్య, గౌడ సంఘ సభ్యులు రంగా శ్రీనివాస్ గౌడ్, పెసర్గాయాలా నర్సింహా రెడ్డి, వెంకట్ రెడ్డి, బిల్ కలెక్టర్ సంపత్, మరియు కాలనీ వాసులు, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరు వేయించిన పూర్వ విద్యార్థులు

విశాలాంధ్ర -రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు తమ స్వంత ఖర్చులతో బోరు వేయించారు. పాఠశాలలో బోరు పాడైందని విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం సుగుణ బీజేపీ నాయకుడు పూర్వ విద్యార్థి వై శ్రీధర్‌తో చెప్పగా ఆయన 1982 -83 బ్యాచ్ విద్యార్థులు వై చిన్మయానంద స్వామి ఎం కృష్ణ రావుల దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. వారు తమ తరగతికి చెందిన విద్యార్థు లందరికీ సమస్యను వివరించి పాఠశాలలో తమ స్వంత ఖర్చులతో బోరు వేయడానికి ముందుకు వచ్చారు. బుధవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమకు చిన్ననాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు అనంత రెడ్డి జంగయ్య మాస్టర్లను పిలిచి వారి చేత బోరు వేసే ముందు పూజలు చేయించారు. పాఠశాల తరఫున డాక్టర్ ఎం సుగుణ కృష్ణారావు, విశ్రాంత ఉపాధ్యాయులైన అనంతరెడ్డి, జంగయ్యలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాడిశెట్టి కృష్ణారావు యతిపతి చిన్మయానంద స్వామి, శోభ బి పద్మారావు, కొంగళ్ళ శ్రీనివాస్ జి నరసింహ రవీందర్ వై వివేకానంద ఇక్బాల్, అక్కిరాజు సుబ్బారావు పీవీ సత్యనారాయణ డి యాదగిరి లు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో బోరు వేయించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని సమాజానికి ఉపయోగపడే వారిగా ఎదగాలన్నారు, ఉపాధ్యాయులను గౌరవించాలని, సంస్కారవంతమైన జీవితాన్ని జీవించాలని సూచించారు

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్ పల్లి మున్సిపాలిటీకి నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్, డోజర్, స్వీపింగ్ మిషన్‌ను పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్స్, గ్లౌస్, అప్రాన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రతిరోజూ ఎన్నో జీవితాల్లో ఆరోగ్య దీపాలను వెలిగిస్తున్నారన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్త ఉంచాలని, అలాగే ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలన్నారు. మన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆలోచన చేయాలన్నారు. అదేవిధంగా వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

షేక్ అబ్దు బక్కర్ జన్మదిన వేడుక

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గం 129 డివిజన్ సూరారం యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దు బక్కర్ పుట్టిన రోజు సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపు కున్నన్నారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి షేక్ అబ్దు బక్కర్ ని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ సంజీవ రెడ్డి,129 డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, సురేందర్ రెడ్డి,127 డివిజన్ అధ్యక్షులు పెరిక శివ, 131 డివిజన్ అధ్యక్షులు ఎండీ జాకీర్,ఎండీ అంజాద్,రహీమ్ ఖాన్,గురువా రెడ్డి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా నీలి నాలుక టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : రైతుల అభివృద్ధిలో పాడిపరిశ్రమ చాలా ముఖ్యమైందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అహ్మద్ అన్నారు. మండలంలోని చిలుకూరు గ్రామంలో బుధవారం మేకలకు, గొర్రెలకు నీలి నాలుక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించు కోవాలన్నారు.జీవాలకు నీలి నాలుక వ్యాధి సోకితే నోటి చుట్టూ పుండ్లు కావడం, నాలుక నీలం రంగులోకి మారడం, జలుబు, శ్వాసకోశ సమస్యలు వస్తాయ న్నారు. వ్యాధి సోకితే జీవాలు తలకిందులుగా పడిపోవడం, లేవలేకపోవడం, గర్భస్రావం, మృత ప్రసవాలు జరుగుతాయన్నారు. ఈ వ్యాధిని నివా రించేందుకు ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైద్యాధికారి ప్రసన్నకు మార్, సిబ్బంది భీంరావు, గోరెమియా తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఘటనపై విచారణ చేపట్టాలి : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం మఖ్దూం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదా లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మహిళా సమాఖ్య జాతీయ సహాయ కార్యదర్శి డా. కె.రజని మాట్లాడుతూ...ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోందన్నారు. గతంలో అక్కడ స్వచ్ఛతా (పారిశుద్ధ్య) కార్మికుడిగా పని చేసిన వ్యక్తి స్వయంగా పోలీస్ స్టేషన్ వెళ్లి 1995 నుండి 2014 మధ్య అనేక మంది మహిళలు, చిన్నారుల మృతదేహాలు అక్కడ బలవంతంగా ఖననం చేయబడ్డాయని ఆ దారుణాలు చూడలేక తాను అక్కడ నుండి పారిపోయి దూరంగా ఉన్నానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ దారుణ ఘటనలో వంద మందికి పైగా హత్యకు గురయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేశాడని. ఇన్ని నేరాలు జరిగిన క్రమంలో స్థానిక పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు పసిగట్ట లేకపోయారు అని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో విచారణ స్వతంత్రంగా జరగాలని డిమాండ్ చేశారు. ఇందులో కొంతమందిపైన లైంగికదాడులు జరిగినట్టుగా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆరోపించారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి,శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ ప్రేమపావని ఎస్.ఛాయదేవి, కృష్ణకుమారి, పడాల నళిని ఐద్వ ఆశ లత, సోషల్ ఆక్టివిస్ట్ ఖలీదా పర్వీన్, పి.ఓ డబ్ల్యూ అనసూర్య, సి.ఎం.ఎస్ జ్యోతి, తిరుమల, సవితలు పాల్గొని మాట్లాడారు. నిష్పక్షపాతమైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధ్వర్యంలో అన్ని కోణాలనూ పరిశీలిస్తూ, బాధితులకు న్యాయం జరగేలా చర్యలు తీసుకోవాలని, జాతీయ మహిళా కమిషన్ చొరవ తీసుకొని ధర్మస్థలలో నిజనిర్ధారణ చేయాలని, ధర్మస్థలను దేవాదాయ ధర్మాదాయ శాఖ తీసుకోవాలని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, తెలంగాణ నుండి మహిళా సంఘాలతో నిజ నిర్ధారణ కమిటీ ధర్మస్థలకు వెళ్లాలని, బాధితుల కుటుంబాలకు సరైన న్యాయం, పునరావాసం, ప్రభుత్వ పరంగా మద్దతు లభించాలని డిమాండ్ చేశారు.

సామాజిక సేవ అంటే ఆర్థిక సాయమే కాదు : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : 'సామాజిక సేవ అంటే కేవలం ఆర్థిక సాయం చేయడమే కాదు... మన చుట్టూ ఉండే వారి అవసరాలను అర్థం చేసుకోవడం, వారికి మద్దతు ఇవ్వడం, సరైన మార్గదర్శనం చేయడం ద్వారా వారి జీవితాల్లో సానుకూల మార్పును తీసుకురావడం" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మానవ జీవితంలో సమాజమే కీలకమని, ఒంటరిగా కాకుండా సామూహికంగానే అభివృద్ధి చెందగలమన్నారు. బుధవారం గౌలిదొడ్డిలోని బ్రాహ్మణ సదనం లో సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్స్ లెన్స్(సీబీఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'సమాజానికి మనం ఎంత ఇస్తే, అది అంతకు రెట్టింపు తిరిగి ఇస్తుంది. అది ధనం రూపంలో కాకపోయినా, ఆత్మ సంతృప్తి రూపంలో, ఆశీర్వాదాల రూపంలో తిరిగి వస్తుంది. ప్రజల మధ్యకు వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం నాకు ఎల్లప్పుడూ సంతృప్తినిచ్చే అంశం' అని చెప్పారు. 'ఒక్కరిగా మనమేం సాధించలేం. అదే సమష్టిగా అడుగు ముందుకేస్తే అసాధ్యం అంటూ ఏదీ ఉండదు. వర్తమానంలో సమాజం పట్ల మన బాధ్యతలు ఏమిటి, భవిష్యత్తుకు ఎలా మార్గదర్శనం చేయగలమో తెలుసుకొని ఆ దిశగా పని చేయాల్సిన అవసరం మనందరిపై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ విషయంలో కొందరూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ సంస్థ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే రూ.25 కోట్లు కేటాయించాం. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇస్తాం. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బ్రాహ్మణుల సంక్షేమానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేస్తున్నా" అని వివరించారు. 'విద్యా, ఉపాధి రంగంలో బ్రాహ్మణ యువతను అత్యున్నత స్థాయికి చేరేలా మార్గ నిర్దేశం చేస్తున్న సీబీఈ సేవలు స్ఫూర్తిదాయకం. ఈ సంస్థ ద్వారా సమాజం కోసం తమ వంతుగా పాటు పడుతున్న రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఉన్నతాధికారులు, ఇతర నిపుణుల కృషి అనిర్వచనీయం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సహకారంతో ఈ సంస్థ ద్వారా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీబీఈ ద్వారా సివిల్స్ కోసం సిద్ధమవుతున్న అయిదు మంది అభ్యర్థుల బాధ్యతను స్వీకరించేందుకు ముందు కొచ్చిన ప్రణీత్ కన్ స్ట్రక్షన్స్ అధినేత సరేందర్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీలు వాణీ దేవి, పురాణం సతీష్ కుమార్, వాలంటే టెక్నాలజీస్ సీఈవో, కో ఫౌండర్ విజయ్ వొద్దిరాజు, ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ ఎస్ రావు, వేణుగోపాల చారి, ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఐవైఆర్ కృష్ణారావు, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అన్నదానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు జన్మదినం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ హైదరాబాద్ హెూప్ ఆధ్వర్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 300 మంది స్థానికులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హెూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఘట్టమనేని బాబురావు జన్మదినం పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు , తమ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, బర్కు మల్లేష్ యాదవ్, సింగదాసరి రాజశేఖర్, మారం వెంకట్, శాంతి భూషణ్ రెడ్డి, విష్ణు మూర్తి, రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, మారం ప్రసాద్ మురళి పాల్గొన్నారు.

వ్యవసాయంపై రామచంద్రరావుకు అవగాహన ఏది : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రాలకు ఎరువుల సరఫరా ఎక్కడ నుండి వస్తుంది ఎవరు చేస్తారు అని అవగాహన లేకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎరువులు రాష్ట్రాల్లో తయారు అయినప్పటికీ అవి రాష్ట్రాల అవసరాల మేరకు తగిన సరఫరా పూర్తిగా కేంద్రం పరిధిలో ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా ఎరువులు డిమాండ్ కి తగిన విధంగా సప్లై లేకపోవడం వల్లే రాష్ట్రంలో రైతులకు కొంత మేర ఎరువుల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ కు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. ఇప్పటి వరకు 12.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈ సంవత్సరంలో మొత్తం ఏప్రిల్ నుండి జూలై వరకు 6.60లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ప్రణాళిక చేయబడగా 4.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేయబడింది ఇంకా 2.25 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందన్నారు. నెలవారి సరఫరా లోటు పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 8 వ తేదీన కేంద్ర రసాయన ఎరువుల శాఖ మంత్రిని కలసి తెలంగాణ ఎరువుల సరఫరా లోటు పై విజ్ఞప్తి చేశారు. మా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రోజువారి యూరియా అమ్మకాలు సగటున 10 వేల - 13 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణకు వచ్చిన యూరియా 4.35 లక్షల మెట్రిక్ టన్నులు అయితే బీజేపీ అధ్యక్షులు 12.02 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. రైతుల విషయంలో రాజకీయాలు మాని కేంద్ర ప్రభుత్వంతో కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సంప్రదింపులు జరిపి రైతగానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ రైతాంగానికి ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎరువుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

చెరువుల సుందరీకరణపై సమీక్ష

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న చెరువుల సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనుల పై మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ , ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , ఇరిగేషన్ అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గల చెరువులలో జరుగుతున్న సుందరీకరణ మరియు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, పనులలో అలసత్వం లేకుండా నిర్ణీత సమయంలో చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మిగతా చెరువుల అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించేల చర్యలు తీసుకోవాలని అధికారులకు గాంధీ తెలియచేశారు. చెరువులను స్వచ్ఛందంగా దత్తత తీసుకొని సీఎస్ఆర్ నిధులతో సుందరికరణ మరియు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, చెరువుల సుందరికరణలో భాగంగా పటేల్ చెరువు , గంగారాం పెద్ద చెరువుల సుందరికరణలో భాగంగా న్యాయ చిక్కులు ఏర్పడటంవలన కోర్ట్ పరిధిలో ఉండటం వలన సుందరికరణ పనులకు ఆటంకం ఏర్పడినది అని, పనులలో జాప్యం నెలకొంది అని, త్వరితగతిన న్యాయ వివాదాలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీఆర్ వంటి అంశాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూసి చెరువుల అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు గాంధీ తెలియచేశారు. చెరువుల సుందరికరణ కు సహకరించాలని, చెరువుల సుందరికరణను వేగవంతం చేస్తామని నియోజకవర్గంలో గల ప్రతి చెరువును సుందర శోభితవనంగా తీర్చిదిద్దుతామని తెలియచేశారు. అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ చెరువుల సుందరికరణ పనులలో బాగస్వామ్యులు కావాలని చైర్మన్ గాంధీ పిలుపునిచ్చారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్దరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, చెరువుల కట్ట బలోపేతం ,పునరుద్దరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ శ్రీనివాస్ ,ఈఈ నారాయణ, డీఈ నళిని, ఏఈ లక్ష్మీ నారాయణ, ఏఈ శ్రీనివాస్, ఏఈ శశాంక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టినట్లు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ కేశంపేట మండలం వేములనర్వ, పుట్టోని గూడ, తులవానిగడ్డ, కొత్తపేట, సుందరాపురం, గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ.... పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ బంగారు తెలంగాణగా చేస్తామని గొప్పగా చెప్పి ఎక్కడి పనులు అక్కడే వదిలేసి పోయారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైవడంతో పాటు ప్రజలకు నరకం చూపించిన నేతలు బీఆర్ఎస్ వాళ్ళు అన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. నాటి ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కట్టించిన పాపాన పోలేదని, మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం నాటి ఇందిరాగాంధీ స్ఫూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని దూషించడం మానుకోవాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని నాయకులందరూ కలిసికట్టుగా ఉండి సంక్షేమ అభివృద్ధి పథకాలు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో కిష్టయ్య, తహసిల్దార్ ఆజాం అలీ, మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి, గూడ వీరేశం,జగదీశ్వర్, కర్ణాకర్ ,భాస్కర్ నాయకులు శ్రీధర్ రెడ్డి,సురేష్ రెడ్డి,అనసూయమ్మ,గిరి యాదవ్,కరుణాకర్ రెడ్డి, నిర్దవెల్లి అమేర్, విజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రిగేడ్ గ్రూప్ జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందం

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : బ్రిగేడ్ గ్రూప్, హైదరాబాద్ మోతీ నగర్‌లో కొత్త రెసిడెన్షియల్ ప్రాజెక్టులైన బ్రిగేడ్ సిటాడెల్ -2, సిటాడెల్ -3 కోసం జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలను చేసుకునట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో అత్యంత ఆదరణ పొందిన రెసిడెన్షియల్ ప్రాజెక్టలలో ఒకటైన బ్రిగేడ్ సిటాడెల్ విజయాన్ని అనుసరిస్తూ, ఈ రెండు కొత్త ప్రాజెక్టులు ఆ మైక్రోమార్కెట్‌లో వ్యూహాత్మక విస్తరణకు సూచికగా నిలుస్తున్నాయి. మొదటి దశ విజయాన్ని కొనసాగిస్తూ, ఈ ప్రాజెక్టులు అధిక ప్రమాణాల డిజైన్, నాణ్యత, సమాజ జీవనానికి నిదర్శనంగా నిలవనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల కలిపిన అభివృద్ధి సామర్థ్యం సుమారు 1 మిలియన్ చదరపు అడుగులుగా ఉంటూ, ?970 కోట్లకు మించి ఆదాయ సామర్థ్యం కలిగి ఉంటుందని అంచనా. 10 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌పై అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్టుల్లో ఆధునిక గృహ కొనుగోలుదారుల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న 405 లగ్జరీ రెసిడెన్సులు ఉంటాయి.హైదరాబాద్‌లో మా స్థిరమైన స్కేలబుల్ వృద్ధిలో ఇది ఒక కీలక దశ. ఇది దక్షిణ భారతదేశంలోని మా ప్రాధాన్య మార్కెట్లలో ఒకటి, మా అభివృద్ధి దిశ, డిజైన్ తత్వం, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే భూమిని అన్వేషించడం కొనసాగుతూనే ఉంటుంది అని బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ మైసూర్ తెలిపారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టి పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు కుంట రవీందర్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ ఉపాధ్యక్షులు ఎర్రం స్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శి నక్క రాములు యాదవ్, జాతీయ అధికార ప్రతినిధి కుమారస్వామి యాదవ్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలను అణగదొక్కారని, ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత బీసీల మీద కపట ప్రేమ చూపిస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలపై ప్రేమ ఉన్నట్టు నటిస్తూ డ్రామాలు ఆడుతున్నాయని అన్నారు. తెలంగాణలో బీసీల అణిచివేతనే ప్రధానంగా బీజేపీ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. 0.1 శాతం జనాభా ఉన్న అగ్రకుల వ్యక్తిని బీజేపీ రాష్ట్ర చీఫ్ పదవి ఇచ్చి బీసీలను అవమానించారని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం జంతర్ మంతర్ దగ్గర చేపట్టబోయే ధర్నాలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి సభ్యులు తెనుగు రాజు ముదిరాజ్, విలాస్ యాదవ్, అమర్ యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో వ్యక్తుల పెత్తనం...

విశాలాంధ్ర -బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఆంధ్ర వ్యక్తుల పెత్తనం కొనసాగుతుందని తెలంగాణ సినిమా వేదిక అధ్యక్షుడు లారా ఆరోపించారు. ఫిల్మ్ ఛాంబర్‌లో వేదిక ఆధ్వర్యంలో జరిగిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి 94వ జయంతి వేడుకల్లో జరిగిన గొడవపై బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో సినారెతో పాటు దాదఫాల్కే అవార్డు గ్రహీత పైడి జయరాజ్ , దాశరథి ఫోటోలు ఎందుకు పెట్టలేదని జయంతి వేడుకల్లో హాజరైన సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అక్కడి వారిని నిలదీశారని అన్నారు. అయితే అక్కడ ఉన్న ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి ప్రసన్న కుమార్ పాశం యదగిరిపై దురుసుగా ప్రవర్తించి గొడవకు దిగారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా తెలంగాణ కవులకు , కళాకారులకు గౌరవం దక్కకపోవడం బాధాకరం అని అన్నారు. గద్దర్ పేరిట తెలంగాణ ప్రభుత్వం ఆంధ్ర నటులకు అవార్డులు ఇచ్చిందని దానిని వాళ్ళు గౌరవించకుండా సీఎం ముందే సినిమా డైలాగ్స్ చెప్తూ అవమానకరంగా వ్యవహరించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌ను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌గా మార్చి , తెలంగాణ నటులను, కవులను , కళాకారులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీసీవీ గౌరవ సలహాదారు ప్రఫుల్ రాంరెడ్డి, టీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రన్న ప్రసాద్,యాదగిరి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

నిధులను మంజూరు చేయండి

విశాలాంధ్ర -రాజేంద్రనగర్ : రాజేంద్ర నగర్ నియోజకవర్గ మైలర్ దేవ్ పల్లి డివిజన్ లో పెండింగ్ లో ఉన్న పనులను ఎస్టిమేషన్ వేసి సీసీ రోడ్లు త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వినతిపత్రం అందచేశాడు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జోనల్ కమిషనర్ త్వరలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యే విదంగా చూస్తాను అని అన్నారు అని తెలిపారు

స్పోర్ట్స్ చైర్మన్‌కి అభినందనలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హాకీ అకాడమీని రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం పట్ల హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ మేరకు భుధవారం హాకీ అధ్యక్షుడు కొండ విజయ్, జిల్లా ప్రతినిధులు కలసి హాకీ స్టిక్ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. హాకీ జిల్లా అకాడమీని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేయడంతో జిల్లాలో హాకీ మరింత పటిష్టం కావడం ఖాయమని తెలిపారు. తమ ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందని శివసేన రెడ్డి తెలిపారు. అకాడమీకి 24 బాయ్స్, 24 గర్ల్స్ ఎంపిక చేసినట్లు తెలిపారు. హాకీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, హాకీ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించాలని కొండ విజయ్ కోరారు. ఈ కార్యక్రమలో హాకీ రంగారెడ్డి సెక్రటరీ కె భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ పాండు రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ అంటే మోదీకి భయం

- గాడితప్పిన చంద్రబాబు
- కష్టజీవులకు అండ ఎర్రజెండా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర–డోన్:

భారతదేశంలో వందేళ్లుగా ప్రజలు, కర్షక, శ్రామిక, రైతుల పక్షాన, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన పార్టీ సీపీఐ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటే ప్రధాని మోదీకి భయమని... అందుకే ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ముగించాడని విమర్శించారు. ఇక రాష్ట్రంలో సీఎం చంద్రబాబు హామీలు అమలు చేయకుండా ప్రజలపై విద్యుత్ భారాలు మోపాడని అన్నారు. సీపీఐ నంద్యాల జిల్లా ద్వితీయ మహాసభ బుధవారం డోన్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ, ప్రజా సంఘాల ఎర్ర చొక్కాలు ధరించి కవాతు నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కామ్రేడ్ ఖాసీం సాహెబ్ సభా వేదిక వరకు పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ ర్యాలీలో డప్పు కళాకారుల ఆట, పాట, మహిళల కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు అధ్యక్షతన జిల్లా మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు హాజరయ్యారు. సభను ఉద్దేశించి రామకృష్ణ ప్రసంగిస్తూ భారతదేశంలో వందేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమేనని అన్నారు. నాడు బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం చేసిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ అధికారం కోసమో, డబ్బు కోసమో ఆరాట పడలేదని, అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని తెలిపారు. కొంతమంది మిడిమిడి జ్ఞానంతో సీపీఐపై విమర్శలు చేస్తుంటారని, వాళ్లు సీపీఐ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ 11 సంవత్సరాల నుంచి పాలన కొనసాగిస్తోందని, అయితే పేద ప్రజలకు ఏమి చేసిందో చెప్పాలని అన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారం ఏదీ?... నల్లధనం ఏమైంది... జనధన్ ఖాతాలకు నగదు జమ ఏమైంది... యువతకు ఉద్యోగాలు ఏమయ్యాయి... ధరల తగ్గింపు ఏదీ... అవినీతి నిర్మూలన ఏమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ప్రశ్నించారు. దేశంలో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారని, కానీ అదానీ, అంబానీతో పాటు 72 శాతం మంది కోటీశ్వరుల ఆస్తులు రెట్టింపు అయ్యాయని తెలిపారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయమని దేశంలో అన్ని పార్టీలు చెబితే ట్రంప్ ఫోన్‌తో మోదీ యుద్ధం విరమించుకోవడం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. మోదీ యోగా చేయడానికి బీజేపీ పాలిత రాష్ట్రాన్ని ఎంచుకోకుండా చంద్రబాబును ఎంచుకుని విశాఖపట్నం వచ్చి యోగా చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు సీనియర్ నేత అయినప్పటికీ గాడి తప్పాడన్నారు. మోదీకి తానా అంటే తందానా అంటూ వంత పాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్‌ను నడపలేక రూ.1.70 వేల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చాడని మండిపడ్డారు. ప్రతి మంగళవారం అప్పులు చేయడమే సరిపోయిందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు రూ.15,480 కోట్లు పెంచాడని అన్నారు. రాష్ట్రాభివృద్ధి పేరుతో సీఎం సింగపూర్‌లో... ఉప ముఖ్యమంత్రి సినిమాల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. డోన్ అంటేనే ఉద్యమాల గడ్డగా పేరుందని, పేదల పక్షాన పోరాటాలు నిర్వహించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత... మరో పార్టీలోకి ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని విమర్శించారు. అలాంటి వారిని ప్రజలు గుర్తించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని... ఎన్నికల్లో అమ్ముకోకూడదన్నారు. వందలో 80 శాతం మంది కర్షకులే ఉన్నారని గుర్తించి ప్రజల కోసం పనిచేసే వారికి పట్టం కట్టాలన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని ప్రజలు గుర్తించాలని కోరారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు పి.రామచంద్రయ్య, పి.భీమలింగప్ప, కె.రామాంజనేయులు, జి.యల్లయ్య, నాగిరెడ్డి, మనోహర్ మాణిక్యం, అజయ్ బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, మద్దిలేటి శెట్టి, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కె.రాధాకృష్ణ, పి.సుంకయ్య, రఘురామమూర్తి, నాగ రాముడు, భాస్కర్, మోట రాముడు తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యత గుర్తిస్తేనే దేశ పురోగమనం: డి.రాజా

చెన్నై:

వైవిధ్యతను గుర్తిస్తేనే దేశ పురోగమనం సాధ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. పార్లమెంటు, ప్రజాస్వామ్యం అణచివేతకు బీజేపీ– ఆర్‌ఎస్‌ఎస్ ఉమ్మడి ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు కమ్యూనిస్టులు ఏకం కావాలని నొక్కి చెప్పారు. కమ్యూనిస్టులు పెరియార్, అంబేద్కర్ అనుచరులని అన్నారు. జీవభారతి రచించిన 'కాలాంతురం కమ్యూనిస్ట్' పుస్తకాన్ని చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు ఆర్థిక మంత్రి థంగం తెన్నరసు, కుంద్రకుడి పన్నంబాలా అడిగాలర్, సీపీఐ, సీపీఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శులు ఆర్.ముతరాసన్, పి.షన్ముగం, కవి వైరముత్తుతో కలిసి డి.రాజా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'భారత్... సంయుక్త రాష్ట్రాల దేశమేగానీ ఏకీకృత రాజ్యం కాదు. వైవిధ్యతను గుర్తించినప్పుడే దేశం పురోగతి సాధించగలదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రద్దు చేయాలని బీజేపీ కోరుకుంటోంది. పార్లమెంటు లేకపోతే ప్రజాస్వామ్యం ఉండదు. హిట్లర్ హయాంలో జర్మనీలో ఇదే జరిగింది' అని అన్నారు. దోపిడీ, అసమానతల నుంచి ప్రజలకు విముక్తి కోసం పెరియార్–అంబేద్కర్‌వాదులతో కలిసి కమ్యూనిస్టులు పని చేయడం సమయానుచితమని డి.రాజా నొక్కిచెప్పారు.

ఆర్థికవేత్త మేఘనాథ్ దేశాయ్ కన్నుమూత

లండన్:

ప్రముఖ ఆర్థికవేత్త, హౌస్ ఆఫ్ లార్డ్స్ సీనియర్ సభ్యుడు లార్డ్ మేఘనాథ్ దేశాయ్ (85) కన్నుమూశారు. అనారోగ్యంతో గురుగ్రామ్‌లోని ఆసుపత్రిలో ఆయన తుది శ్వాస విడిచారని లండన్‌లోని ఆయన కుటుంబానికి సన్నిహితులు తెలిపారు. గుజరాత్‌లో పుట్టిన ఈ మేధావికి భారత ప్రధాని మోదీ నివాళులర్పించారు. దేశాయ్ మరణం బాధాకరమని, విశిష్టమైన మేధావి, రచయిత, ఆర్థిక వేత్తను కోల్పోయామని సామాజిక మాధ్యమంలో సంతాపం ప్రకటించారు. భారత్‌తో, భారతీయ సంప్రదాయంతో ఆయనది విడదీయరాని బంధమని పేర్కొన్నారు. దేశాయ్ కుటుంబానికి, బంధు మిత్రులకు ప్రధాని సానుభూతి తెలిపారు. దేశాయ్ పద్మభూషణ్ పురస్కారగ్రహీత. 1965 నుంచి 2003 వరకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్‌ఎస్‌ఈ)లో బోధించారు. ఆపై ఎమిరిటస్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అయ్యారు. 1992లో ఎల్‌ఎస్‌ఈలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ గ్లోబల్ గవర్నెన్స్‌ను ఆయన నెలకొల్పారు. ఎల్‌ఎస్‌ఈ డెవలప్‌మెంట్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్‌కు వ్యవస్థాపక సభ్యుడిగా, డైరెక్టర్‌గా ఉన్నారు. 1971లో లేబర్ పార్టీలో చేరారు. 1951లో హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికయ్యారు. 2020లో పార్టీకి రాజీనామా చేశారు. గాంధీ స్టాట్యూ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక–ట్రస్టీగా దేశాయ్ ఉన్నారు. మహాత్ముడి విగ్రహం ఏర్పాటునకు నిధులు సేకరించారు. గాంధీ విగ్రహాన్ని 2015లో లండన్ పార్లమెంటు స్క్వేర్‌లో అప్పటి ప్రధాని డేవిడ్ కామరూన్ ఆవిష్కరించారు. దేశాయ్‌కు ప్రముఖులు నివాళులర్పించారు.

కార్పొరేట్లకు లొంగిపోవడమే....

- భారత్-బ్రిటన్ వాణిజ్య ఒప్పందంపై ఏఐకేఎస్
- 13న దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

న్యూఢిల్లీ:

బ్రిటన్‌తో సమగ్ర ఆర్థిక–వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) చేసుకోవడంతో కార్పొరేట్లకు సర్కారు లొంగిపోయిందని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) విమర్శించింది. ఈ ఒప్పందంతో దేశానికి ద్రోహం చేసిందని పేర్కొంది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రతలో దేశ సార్వభౌమత్వానికి జరిగిన మోసాన్ని ప్రతిఘటించాలని మంగళవారం ఒక ప్రకటనలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. బ్రిటన్‌తోనే కాకుండా అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ఆపాలని, కార్పొరేట్‌కు దాసోహం కావద్దని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. రాష్ట్రాల రాజధాని నగరాల్లో, జిల్లా కేంద్రాల్లో సీఈటీఏ ఒప్పంద ప్రతులను తగలబెట్టి నిరసన తెలపాలని రైతులు, కార్మిక సంఘాలు, విద్యార్థులు, పౌర సంఘాలకు పిలుపునిచ్చారు. నయా వలసవాదాన్ని తిరస్కరించాలన్నారు. సీఈటీఏను పార్లమెంటులో అడ్డుకోవాలని ప్రతిపక్ష పార్టీలను రావుల వెంకయ్య, క్షీరసాగర్ డిమాండ్ చేశారు. ఫెడరలిజానికి కట్టుబడాలని కోరారు. ఈ ఒప్పందానికి ముందు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపలేదన్నారు. సీఈటీఏకు వ్యతిరేకంగా గళం వినిపించేందుకు భావ సారూప్యతగల వారంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. భారత ఆహార, ఆరోగ్య, ఆర్థిక సార్వభౌమత్వాన్ని పరిరక్షించడం కోసం సీఈటీఏ వ్యతిరేక పోరు అవశ్యమన్నారు. ఈ ఒప్పందం భారత రైతులను మృత్యుకూపంలో నెడుతుందని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య ఆందోళన వ్యక్తంచేశారు. భారతీయ ఎగుమతులపై 99 శాతం సుంకాల రద్దుతో బ్రిటన్ వ్యవసాయోత్పత్తులకు దేశీయ మార్కెట్ల ద్వారాలు తెరుచుకుంటాయని, దీంతో డెయిరీ, గోధమలు, మొక్కజొన్న, వంట నూనె వంటి ఉత్పత్తులు కుప్పలు తెప్పలుగా భారత మార్కెట్లకు చేరుతాయన్నారు. దేశ సంపద దోపిడీకి గురవుతుందని, ప్రైవేటీకరణతో విద్యుత్ టారిఫ్ పెరిగి సామాన్యులు నష్టపోతారని వెంకయ్య, క్షీరసాగర్ పేర్కొన్నారు.

రాజకీయ లబ్ధే బీజేపీ లక్ష్యం

పహల్గాం బాధితులను ఆదుకోని కేంద్రం: నారాయణ విమర్శ

న్యూఢిల్లీ:



కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఆ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంట్‌లో ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇటీవల తాను పహల్గాంలో పర్యటించానని గుర్తుచేశారు. పహల్గాం వెళ్లి స్థానికులను అడిగితే వాస్తవాలు బయటపడతాయన్నారు. ప్రపంచంలో అబద్ధాలు అనర్గళంగా మాట్లాడే వారిలో మోదీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముందుంటారని ఎద్దేవా చేశారు. దిల్లీలో నారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. పహల్గాంలో పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నట్లు నారాయణ చెప్పారు. ఉగ్రవాదులు మతం ఆధారంగా చంపారని మోదీ అంటున్నారని, ఉగ్రవాదులు ఇష్టం వచ్చినట్లుగా చంపి వెళ్లిపోతారు తప్ప వివరాలు అడగరని అన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం బాధితులకు కోటిరూపాయల పరిహారం ఇచ్చిన కేంద్రం ప్రభుత్వం... ఆపరేషన్ సిందూర్‌లో చనిపోయిన వారికి లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన మూడు రోజులకు మోదీ బీహార్ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారని, ఎన్నికల సమయంలో సైనిక చర్యలను రాజకీయం కోసం వాడుకున్నారని నారాయణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను చెబితేనే యుద్ధం ఆపారని ట్రంప్ అంటున్నారని, పాకిస్థాన్ వేడుకుంటే ఆపామని మోదీ అంటున్నారని, ఇద్దరిలో ఎవరు అబద్ధం చెబుతున్నారో వెల్లడించాలని నారాయణ నిలదీశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఉగ్రవాదులను హతమార్చడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. దేశంలో ప్రతి దు:ఖపూరిత ఘటనను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు తమ స్వలాభం కోసం రాజకీయంగా వాడుకుంటాయని నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిఘా వైఫల్యం గురించి గానీ, దాదాపు 400 మంది పర్యాటకులు ఉన్న పహల్గాంలో కనీసం ఒక్క జవాను లేకపోవడం గానీ, అకస్మాత్తుగా ఆపరేషన్ సిందూర్ ఆపడం వంటి అంశాలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పలేదని నారాయణ విమర్శించారు. కేవలం గత చరిత్ర గురించి మాత్రమే మోదీ మాట్లాడారని, కాంగ్రెస్‌పై ఎదురుదాడి తప్ప దేశ ప్రజలు సంధించిన ప్రశ్నలకు సమాధానం లేదని నిందించారు.



కృష్ణా నదికి వరద ఉద్ధృతి

- ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత
- అధికారులు అప్రమత్తం
- లోతట్టు ప్రాంతాలకు హెచ్చరికలు

విశాలాంధ్ర–విజయవాడ:

కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాగటంతో ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం 70 గేట్లను ఎత్తటంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం క్రమం క్రమంగా పెరుగుతుండటంతో 15 గేట్లను 2 అడుగుల మేర, 55 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ప్రకాశం బ్యారేజీ ఇన్ ఫ్లో 87,441 క్యూసెక్కులుగా ఉండగా ఔట్ ఫ్లో 87,441 క్యూసెక్కులుగా ఉంది. కృష్ణా తూర్పు కాలువకు 10,207 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ కాలువకు 5,527 క్యూసెక్కులు, గుంటూరు ఛానెల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద పోటెత్తిన నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తతో ఉండాలని అధికారులు హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గ్రామాల్లోకి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. అధికారులు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. తీర ప్రాంత ప్రజలంతా అధికారులకు సహకరిస్తూ తమ గ్రామాలకు రక్షణ కవచంగా నిలవాలని కోరారు. దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. కృష్ణా నది మీద ప్రాజెక్టుల్లోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున నదీ పరీవాహక ప్రాంత ప్రజలు, లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బోట్లు, మోటర్ బోట్లు, పంట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించవద్దన్నారు.

సాగర్ గేట్లు ఎత్తివేత

మరోవైపు నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లోకి ఇన్ ఫ్లో 2,82,996 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 3,12,158 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.2 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 301.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తప్పా?

- ధర కాదు, ప్రయోజనమే ముఖ్యం
- ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం
- టీసీఎస్‌కు భూ కేటాయింపులపై హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

పెట్టుబడులు రాబట్టేందుకు పారిశ్రామిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలిస్తే తప్పేంటని రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. విశాఖలో టీసీఎస్‌కు భూ కేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. కంపెనీలకు ఏ రేటుకు భూమి ఇస్తున్నారనే దానికంటే, ఆ పరిశ్రమ రాకతో రాష్ట్రానికి ఎంత ప్రయోజనం కలుగుతుందన్నదే ముఖ్యమని పేర్కొంది. 'రాష్ట్రాభివృద్ధి ప్రారంభ దశలో ఉంది. టీసీఎస్‌ను ఆకర్షించేందుకు నామమాత్రపు ధరతో ప్రభుత్వం భూమిని కేటాయించి ఉండొచ్చు. ఎంత రేటుతో కేటాయిస్తున్నారనేది కాదు. ఆ సంస్థతో రాష్ట్రానికి ఎంత ప్రయోజనం కలుగుతుందో చూడాలి. టీసీఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడితో 12వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతోంది. ఐటీ వృద్ధితో హైదరాబాద్, బెంగళూరు ఎలా ఉన్నాయో చూస్తున్నాం కదా!' అని కోర్టు వ్యాఖ్యానించింది. లీజు పద్ధతిలోనే టీసీఎస్‌కు 21.16 ఎకరాల భూమిని కేటాయిస్తున్నామని ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. నామమాత్రపు రేటుకు భూమిని విక్రయిస్తున్నామన్న పిటిషనర్ వాదనలో వాస్తవం లేదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. భూ కేటాయింపులు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

ట్రంప్ చెప్పేది అబద్ధమనే ధైర్యం లేదా: ఖర్గే

న్యూఢిల్లీ:

ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్–పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పదంతా అబద్ధమని నిలదీసే ధైర్యం కేంద్రానికి లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. పార్లమెంటు వెలుపల బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ 'ట్రంప్ మాటలు అబద్ధమని చెప్పే ధైర్యం కేంద్రానికి లేదు. ఇలాంటి అర్థంలేని విషయాలను సహించబోమని బీజేపీ నేతలు తేల్చిచెప్పలేరు' అని అన్నారు.

వయనాడ్‌పై కేంద్రం నిర్లక్ష్యం: ప్రియాంక

న్యూఢిల్లీ:

కేరళ, వయనాడ్ బాధితులకు పునరావాసం కల్పించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో బుధవారం ఈ అంశాన్ని ఆమె ప్రస్తావించారు. వయనాడ్‌కు నామమాత్రం రుణమిచ్చే నిర్ణయాన్ని కేంద్రం పున:పరిశీలించాలని డిమాండ్ చేశారు. 'గతేడాది జులై 30న వయనాడ్‌లో చూరల్‌మల, ముండక్కైల్లో కొండచరియలు విరిగిపడి 400 మంది మరణించగా, 100 మందికి పైగా గల్లంతయ్యారు. 17 కుటుంబాలు తుడిచిపెట్టుకుపోయాయి. సుమారు 1,600 భవనాలు, వందల ఎకరాల వ్యవసాయ భూమి ధ్వంసమయ్యాయి. ఇది చిన్నవ్యాపారులు, రైతుల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేసింది' అని ప్రియాంక తెలిపారు. వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించడానికి కేంద్రం నిరాకరించినప్పటికీ, తర్వాత ఈ విషాదాన్ని అధిక తీవ్రత కలిగిన విపత్తుగా ప్రకటించిందని గుర్తుచేశారు. దీంతో వయనాడ్‌కు ప్రయోజనం అందలేదన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో ముఖ్యమైన అంశాలపై చర్చలు జరుగుతున్నందున వయనాడ్‌లో నిర్వహించిన వార్షిక కార్యక్రమానికి వెళ్లలేకపోయానని ప్రియాంక తెలిపారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆరోగ్యశాఖ డైరెక్టర్ హామీ

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి:

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ సిరి హామీ ఇచ్చినట్టు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశాఖ డైరెక్టర్, యూనియన్ సంయుక్త సమావేశం డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగింది. వైద్య ఉద్యోగులకు సంబంధించి 21 దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సు, ఫార్మసీ సూపర్‌వైజర్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ పదోన్నతులు ఏప్రిల్ నుంచి కల్పించారని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చినట్టు నేతలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లా ఆసుపత్రులలో చీఫ్ రేడియోగ్రాఫర్ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 35 రోజుల సీఎల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇస్తామని చెప్పారన్నారు. పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు 549 జీవో ప్రకారం జీతం రూ.16 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. నర్సింగ్ సిబ్బందికి రేషన్ అలవెన్స్, నైట్ డ్యూటీ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ 101 జీవో ప్రకారం అమలు చేయాలని కోరగా, ట్రెజరీ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.సాయి సత్యనారాయణ, ఎ. గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.